దేన్నీ వదలని ఫ్యామిలీ మాఫియా

- యువగళం యాత్రలో నారా లోకేష్ - తుగ్గలి మండలంలో ఘన స్వాగతం

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి/తుగ్గలి

పత్తికొండ ఎమ్మెల్యే ఫ్యామిలీ మాఫియా దేన్నీ వదలడం లేదని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పేర్కొన్నారు. యువగళం పాదయాత్ర శనివారం ప్యాపిలి మండలం పొలిమేర మెట్ట నుంచి ప్రారంభమై తుగ్గలి మండలం రాంపల్లి క్రాస్ వరకు సాగింది. టిడిపి పత్తికొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జీ కెఇ.శ్యాంబాబు, కెఇ.ప్రభాకర్, బత్తిన వెంకటరాముడు, టిడిపి మండల కమిటీ అధ్యక్షులు తిరుపాల్ నాయుడు లోకేష్‌కు స్వాగతం పలికారు. రాంపల్లి క్రాస్ వద్ద బహిరంగ సభలో లోకేష్ మాట్లాడుతూ... మద్దికెర రైల్వేస్టేషన్‌లో కప్పం కట్టలేదని రైల్వే కాంట్రాక్టర్‌పై దాడి చేసి వాహనాలు ఎత్తుకెళ్లారు ఫ్యామిలీ మాఫియా సభ్యులని తెలిపారు. బంగారు గనుల యజమానులను బెదిరించి పనులు జరగకుండా ఆపేశారని, టమోటా మార్కెట్‌లో వ్యాపారులను బెదిరించి కమీషన్లు వసూలు చేస్తున్నారని విమర్శించారు. ఆఖరికి రేషన్ బియ్యాన్ని కూడా అక్రమ రవాణా చేస్తుంది ఈ ఫ్యామిలీ మాఫియా అని తెలిపారు. పత్తికొండ చెరువును కూడా కబ్జా చేస్తున్నారన్నారు. టమోటా జ్యూస్ ఫాక్టరీ ఏర్పాటు చేస్తామన్నారని, ఆ హామీ ఏమైందనిఎమ్మెల్యే శ్రీదేవిని ప్రశ్నించారు.

దళితుల భూమిని ఆక్రమించిన వైసిపి నేతలు

- లోకేష్‌ను కలిసి గోడు వెళ్లబోసుకున్న బాధితులు

పత్తికొండ నియోజకవర్గం చెర్లకొత్తూరు గ్రామానికి చెందిన దళితులు యువనేత నారా లోకేష్‌ను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. మూడున్నర దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న తమ భూమిని వైసిపి నేతలు ఆక్రమించి, భూమిలోకి వస్తే చంపేస్తామని బెదిరిస్తున్నారని వాపోయారు. పెద్దకొండలో బాధిత దళితులు లోకేష్‌ను కలిసి వైసిపి నేతల అరాచకాన్ని వివరించారు. భూమిని కబ్జా చేసి తమను అడ్డుకుంటున్నారని, ఈ విషయమై తహశీల్దార్ దగ్గర నుంచి కలెక్టర్ వరకు అధికారులందరికీ మొరపెట్టుకున్నా న్యాయం జరగలేదని తెలిపారు. నాలుగేళ్లుగా తమను పొలంలోకి రానీయకపోవడంతో బీడుగా మారిపోయిందని, న్యాయం చేయాలని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి దగ్గరకు వెళితే భూమి మాది కాదని అంటున్నారని తెలిపారు. టిడిపి అధికారంలోకి వచ్చాక తమకు న్యాయం చేయాలని కోరారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే వైసిపి నేతలు కబ్జా చేసిన భూమిని దళితులకు అప్పగిస్తామని, న్యాయం కోసం పోరాడుతున్న దళితులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేస్తామని లోకేష్ హామీ ఇచ్చారు.

ప్రజలకు అభివాదం చేస్తున్న నారా లోకేష్



నిరసనకారులను అడ్డుకుంటున్న పోలీసులు



లోకేష్‌ను కలిసిన కలచట్ల గ్రామస్తులు

కలచట్ల గ్రామస్తులు యువనేత లోకేష్‌ను కలిసి సమస్యలు విన్నవించారు. గ్రామంలో అంతర్గత రోడ్లను తవ్వేసి వదిలేయడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, వేసవిలో తాగు, సాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. గ్రామ చెరువును హంద్రీనీవా జలాలతో నింపాలని కోరారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కలచట్ల చెరువుకు హంద్రీనీవా నీళ్లిస్తామని లోకేష్ హామీ ఇచ్చారు.

ఆ ఇళ్లకు ప్రభుత్వం బిల్లులు ఇవ్వడం లేదు

- లోకేష్‌ను కలిసిన ఎన్‌టిఆర్ హౌసింగ్ లబ్ధిదారులు

ఎస్.రంగాపురం ఎన్‌టిఆర్ హౌసింగ్ లబ్ధిదారులు యువనేత లోకేష్‌ను కలిసి సమస్యలు విన్నవించారు. టిడిపి హయాంలో ఎన్‌టిఆర్ హౌసింగ్ పథకం కింద గ్రామంలో నిర్మించుకున్న ఇళ్లకు ప్రస్తుత ప్రభుత్వం బిల్లులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతోందని తెలిపారు. సిసి రోడ్లు, మౌలిక సదుపాయాలు కల్పించకుండా వైసిపి ప్రభుత్వం వేధిస్తోందన్నారు. అప్పులు చేసి ఇళ్లు పూర్తి చేసుకున్న మేము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎన్‌టిఆర్ గృహ నిర్మాణ పథకం కింద లబ్ధిదారులకు పెండింగ్ బిల్లులు అందజేస్తామని, మౌలిక సదుపాయాలు కల్పిస్తామని లోకేష్ హామీ ఇచ్చారు.

లోకేష్‌ను కలిసిన శభాష్‌పురం గ్రామస్తులు

తుగ్గలి మండలం శభాష్‌పురం గ్రామస్తులు లోకేష్‌ను కలిసి సమస్యలను విన్నవించారు. గ్రామంలో సాగు, తాగునీటి సమస్య అధికంగా ఉందని, పొలాల బోర్ల వద్దకెళ్లి తాగునీరు తెచ్చుకోవాల్సి వస్తోందని తెలిపారు.

నిరసన... పోలీసుల రంగ ప్రవేశం..

దళితులను కించపరిచే విధంగా మాట్లాడిన లోకేష్ ఎస్సీలకు క్షమాపణ చెప్పాలంటూ నియోజక వర్గంలోని కొంతమంది దళిత సంఘం నాయకులు, దళితులు శభాష్‌పురంలో పాదయాత్ర చేస్తున్న లోకేష్ సమీపంలో నిరసన వ్యక్తం చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు వారిని చెదరగొట్టే ప్రయత్నం చేశారు. లోకేష్ క్షమాపణ చెప్పేంత వరకు నిరసనను విరమించబోమని దళిత నాయకులు, సంఘాలు చెప్పడంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి వారిని చెదరగొట్టారు. లోకేష్ పాదయాత్ర సజావుగా సాగింది.

లోకేష్‌పై ఫేక్ మీడియా విష ప్రచారం

- టిడిపి ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఎంఎస్.రాజు

అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా జగన్ ఫేక్ మీడియాను అడ్డం పెట్టుకొని, ఫేక్ ప్రచారాన్నే నమ్ముకుంటున్నారని టిడిపి ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఎంఎస్.రాజు తెలిపారు. క్యాంపు సైట్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితులతో జరిగిన ముఖాముఖి కార్యక్రమంలో లోకేశ్ మాట్లాడింది చూస్తే, ఆయన దళితజాతి అభ్యున్నతి కోసం ఎంతగా ఆలోచిస్తున్నారో అర్థమవుతుందన్నారు. అధికార దాహంతో జగన్ అతని ఫేక్ మీడియా చేసే విషప్రచారాన్ని నమ్మవద్దని దళితులకు విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. తప్పుడు ప్రచారం చేయడం జగన్, అతని దిక్కు మాలిన మీడియాకు, అతని చిల్లరకు కక్కుర్తి పడే పేటిఎం బ్యాచ్‌కే చెల్లిందన్నారు.

ముందు నుంచి లోకేష్ వెంటే...



ఆయన వికలాంగుడు. అయినా అనుకుంటే సాధ్యం కానిది ఏదీ లేదని నిరూపిస్తున్నారు. అనంతపురం జిల్లా అమడగూరు మండలానికి చెందిన టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.రామంజులు నాయుడు తన మూడు చక్రాల బండితో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర వెంటే సాగుతున్నారు. యాత్ర ప్రారంభం నుంచి ఇప్పటి వరకు 900 కిలో మీటర్లు ఆయన కూడా తన యాత్ర సాగిస్తున్నారు. తనతో పాటు శ్రీసత్యసాయి జిల్లా రైతు సంఘం అధికార ప్రతినిధి కె.రెడ్డప్ప కూడా ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నారా లోకేష్

గుక్కెడు నీటి కోసం అవస్థలు

- ఖాళీ బిందెలతో మహిళల ఆందోళన

ప్రజాశక్తి - పెద్దకడబూరు

పెద్దకడబూరులోని సుంకులమ్మ గుడి వీధిలో గుక్కెడు తాగునీటి కోసం అష్ట కష్టాలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. శనివారం మహిళలు ఖాళీ బిందెలతో కాలనీలో ఆందోళనకు దిగారు. కాలనీలో కుళాయిలు ఉన్నా తాగునీరు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పక్కన కాలనీవాసులు ప్రధాన రహదారి వెంట అగ్రవర్ణాలు వారు తాగునీరు సరఫరా చేసి వెంటనే విద్యుత్ మోటర్లు వేసుకోవడంతో తమకు గుట్టెడు నీరు కూడా రావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ మోటార్లు వేసుకోవడానికి తాగునీరు సరఫరా చేసే వాటర్ మ్యాన్‌లే సహకరిస్తున్నారని మహిళలు వాపోయారు. సర్పంచి స్పందించి సుంకలమ్మ గుడి కాలనీకి సక్రమంగా తాగునీటిని సరఫరా చేయాలని కోరారు. లేకపోతే సోమవారం మండల పరిషత్ కార్యాలయం ముందు ఖాళీ బిందెలతో ధర్నా చేపడతామని హెచ్చరించారు.



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సృజన

పకడ్బందీగా 'పది' పరీక్షలు

- కలెక్టర్ డాక్టర్ సృజన

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం నగరంలోని ఇందిరాగాంధీ మెమోరియల్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సృజన మాట్లాడారు. పరీక్ష కేంద్రాల్లో మౌలిక సదుపాయాల్లో భాగంగా విద్యార్థులకు తాగునీరు ఏర్పాటు చేశారా, పాఠశాలలో బాత్‌రూమ్స్ బాగున్నాయా లేదా అని ఆరా తీశారు. పరీక్ష కేంద్రంలోకి ఎలాంటి బ్యాగులు, ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున పరీక్ష కేంద్రాల్లో ఒఆర్ఎస్ ద్రావణాలు అందుబాటులో ఉంచుకోవాలని ఎఎన్ఎంను ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా గట్టి చర్యలు తీసుకోవాలని తెలిపారు. డిఇఒ రంగారెడ్డి పాల్గొన్నారు.

ప్రచార భేరి ప్రారంభం

ప్రజాశక్తి-కర్నూలు ప్రత్యేక ప్రతినిధి

కేంద్రంలోని బిజెపిని సాగనంపి దేశాన్ని కాపాడుకుందామని సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతినాడు చేపట్టిన ప్రచార భేరి కార్యక్రమం కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ప్రారంభమైంది. కలెక్టరేట్ల వద్ద నిరసన తెలిపిన అనంతరం ఆయా పార్టీల నాయకులు , కార్యకర్తలతో భారీ ప్రదర్శనలు నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి అక్కడే భైటాయించారు. పాలకుల ప్రజావ్యతిరేక విధానాలకు ఎండగడుతూ ప్లకార్డులు ప్రదర్శించారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక విద్వేషాలను రెచ్చగొట్టి ప్రజల మధ్యన విభేదాలు సృష్టించి పబ్బం గడుపుకునే పరిస్థితి ప్రజలకు వివరించారు. అంతకు ముందు ఉమ్మడి జిల్లాలో వారంరోజులపాటు విస్తృతంగా ప్రచారం చేశారు. ఈనెల 14 నుంచి 31 వరకు ఈ ప్రచార భేరి కార్యక్రమం కొనసాగనుంది. ఈవారంలో కలెక్టర్, జెసి, ఎస్‌పిలు బదిలీ అయ్యారు. నారాలోకేష్ యువగళం పాదయాత్ర ఉమ్మడి జిల్లాలోకి ప్రవేశించింది. వివిధ రకాల అడాడమిక్ పరీక్షలు ముగిశాయి. ప్రవేశ పరీక్షలకు విద్యార్థులు సిద్ధమవుతున్నారు. అంబేద్కర్, పూలే, బాబుజగ్జీవన్ రామ్ జయంతులు నిర్వహించారు. ఎండల తీవ్రత పెరిగింది. గుడ్‌ఫ్రైడే ఉపవాస దీక్షలు ముగిశాయి. రంజాన్ ఉపవాస దీక్షలు కొనసాగుతున్నాయి.

లోకేష్ యువగళం యాత్ర: టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం డి.రంగాపురంలోకి ప్రవేశించింది. డోన్ నియోజకవర్గం గుండా కర్నూలు జిల్లా పత్తికొండ నియోజకవర్గంలోకి ప్రవేశించింది. ఉమ్మడి జిల్లాలో 14 నియోజకవర్గాలలో సభలు నిర్వహించనున్నారు. వివిధ రంగాల ప్రజలతో విడివిడిగా నారాలోకేష్ చర్చలు జరపాలని నిర్ణయించారు. 35 రోజులు ఈ యాత్ర సాగే అవకాశం ఉంది. టిడిపి కార్యకర్తలు భారీఎత్తున తరలివస్తున్నారు.

కొత్త సారథులొచ్చారు: కర్నూలు కలెక్టర్ కోటేశ్వర్‌రావు, ఎస్‌పి, సిద్దార్థ్ కౌశల్, జాయింట్ కలెక్టర్ రామసుందర్‌రెడ్డి బదిలీ అయ్యారు. కొత్త కలెక్టర్‌గా డాక్టర్ పి.సృజన, ఎస్‌పిగా జి.కృష్ణకాంత్, జాయింట్ కలెక్టర్ నారపరెడ్డి మౌర్య బాధ్యతలు చేపట్టారు. నంద్యాల జిల్లాలో ఉపాధి సిబ్బందిని అధికారులను బదిలీ చేశారు. కొత్తవారు వచ్చేవరకు కొంత గందరగోళం ఏర్పండి.

పరీక్ష కాలం : ఇంటర్ పరీక్షలు పూర్తవగానే పదోతరగతి పరీక్షలు ఈ వారమంతా జరిగాయి. శనివారం పదోతరగతి ముగిశాయి. వివిధ రకాల పరీక్షలు, ప్రవేశ పరీక్షల తేదీలు రావడంతో ఇంటర్, టెన్త్, వివిధ రకాల పరీక్షలకు విద్యార్థులు సిద్ధమవుతున్నారు.

ముదిరిన ఎండలు: ఎండా కాలం ముదిరింది. మూడు, నాలుగు రోజుల 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు ఉండటంతో ప్రజలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ఎనిమిదేళ్ల తరువాత ఇవే అధ్యధిక ఉష్ణోగతలని నిపుణులు అంటున్నారు. వేసవిని తట్టుకునేందుకు ఎసిలు, కూలర్లను ప్రజలు వినియోగిస్తున్నారు. శీతల పానియాలకు గిరాకీలు పెరిగాయి. అప్పుడప్పులు విద్యుత్ కోటలుండటంతో ప్రజలు ఉక్కపోతను తట్టుకోలేక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

పండుగలు: గుడ్‌ఫ్రైడేలు, రంజాన్ పండుగలు రావడంతో చర్చిలు, మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దాతలు క్రిష్టియన్లకు , ముస్లింలకు నిత్యావసర కిట్లను అందజేశారు.

మహనీయుల జన్మదినాలు : బాబుజగ్జీవన్‌రామ్, మహాత్మజ్యోతిరావుపూలే, డాక్టర్ బీమ్‌రావు అంబేద్కర్ జయంతి వేడుకలు ఏప్రెల్ మొదటి రెండో వారంలో వచ్చాయి. ప్రభుత్వ.ప్రయివేటు సంస్థలు ఆయా సంఘాలు మహనీయుల జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఏప్రెల్ 14న భారీ ఎత్తున కార్యక్రమాలు నిర్వహించారు.

నిరసనలు: కేంద్ర ప్రభుత్వం సిపిఎం, సిపిఐతో పాటు కాంగ్రెస్ పార్టీ కూడా వివిధ రూపాల్లో కార్యక్రమాలను చేపట్టింది. నిరసనలు, రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించారు. మట్టి మాఫియాపై సిపిఎం, సిపిఐ, వివిధ సంఘాలతో పాటు జర్నలిస్టు సంఘాలు కూడా నిరసన తెలిపాయి. ఉన్నతాధి కారులకు వినతి పత్రాలు సమర్పించారు.



శిథిలావస్థకు రక్షక భటుల క్వార్టర్లు

ఎస్‌ఎపి క్యాంపులో కంపచెట్లకు, విష సర్పాలకు నిలయం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్




శిథిల క్వార్టర్స్ పరిశీలిస్తున్న పిపిఎస్ నాయకులు

పలు రాష్ట్రాలలో ప్రజలకు సేవలు అందించిన 2వ బెటాలియన్ స్పెషల్ పోలీస్ క్వార్టర్స్ శిథిలావస్థకు చేరి కంప చెట్లు పెరిగి విష సర్పాలకు నిలయంగా మారిరాయి. వందల కోట్ల విలువగల స్పెషల్ పోలీస్ కాలనీ లోకల్ పోలీస్ కాలనీలకు ఎంతో చరిత్ర ఉంది. ఎక్కడైనా గొడవలు జరిగినా ప్రజలు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు సమాచారం అందిన గంటలోనే వందల మంది పోలీస్ సిబ్బంది ప్రభుత్వం ఆదేశాల ప్రకారం సంబంధిత ప్రాంతాలకు వెళ్లిన ప్రజలకు రక్షణ కల్పించిన చరిత్ర గల ఈ కాలనీలను ప్రభుత్వం కనీసం సున్నం కొట్టి కంపచెట్లు తొలగించాలనే స్పృహ లేదని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఇరిగినేని పుల్లారెడ్డి నగర నాయకులు ఎం.నాగరాజు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం పట్టణ పౌర సంక్షేమ సంఘం ప్రతినిధి బృందం 42వ వార్డులోని స్పెషల్ పోలీస్ క్వార్టర్స్ లోకల్ పోలీస్ క్వార్టర్స్ ప్రాంతాలను పరిశీలించారు. పోలీస్ క్వార్టర్లన్నీ ఒకే చోట ఉండాలని స్వాతంత్రానికి ముందు నుంచి ఉన్న నిబంధనలను ప్రభుత్వం పక్కన పెట్టిందన్నారు. క్వార్టర్స్ గోడల్లో పెద్ద చెట్లు పెరిగాయని ఎప్పుడు కూలిపోతాయో తెలియని పరిస్థితి ఉన్నందున స్పెషల్ పోలీస్ క్వాటర్స్‌లో 90శాతం లోకల్ పోలీస్ క్వార్టర్స్ లో 99శాతం పోలీస్ సిబ్బంది క్వార్టర్లు ఖాళీ చేసి నగరంలో వివిధ కాలనీల్లో ఉంటున్నారు. 192 సివిల్ పోలీస్ క్వార్టర్స్‌లో కేవలం ఆరు కుటుంబాలు కాపురం ఉంటున్నాయి. వారు ఉండడం వలన క్వాటర్లలో అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా ఉన్నట్లు తెలుస్తుంది. ఆ క్వార్టర్లు ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితుల్లో ఉన్నందున ఏం జరిగినా మాకు సంబంధం లేదని ఉన్నతాధికారులు చెప్పడంతో ఖాళీ చేసి వెళ్లిపోయినట్లు సమాచారం. ఈ పర్యటనలో నగర నాయకులు ఎన్.మద్దిలేటి, ఎ.వెంకటేశ్వర్లు, ఎం.సాంబశివారెడ్డి, ఎల్.రమణ గౌడ్, కె.శ్రీనివాసులు, జి. సోమశేఖర్ పాల్గొన్నారు.

లోకేష్‌కు సర్పంచుల వినతి

ప్రజాశక్తి తుగ్గలి



యువగళం రాష్ట్ర అధ్యక్షులు నారా లోకేష్ కు సర్పం చుల సంఘం ఆధ్వర్యంలో పాద యాత్ర చేస్తున్న లోకేష్‌కు శనివారం వినత పత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ సర్పంచులుగా రెండు సంవత్సరాలు నుండి ఉన్నప్పటికీ ఇప్పుటి వరకు గ్రామపంచాయతీకి నిధులు లేవన్నారు. ఒకవేళ నిధులు వచ్చినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే తమ ఖాతాలో వేసుకుంటుందని, దీంతో గ్రామపంచాయతీ అభివద్ధి చేయలేకపోతున్నామని వారు ఆయన ఎదుట వాపోయారు. స్పందించిన లోకేష్ టిడిపి అధికారంలోకి వచ్చిన మరుక్షణమే గ్రామపంచాయతీకి అధిక నిధులు కేటాయించి అభివద్ధి చేస్తామన్నారు. వెంకటపతి, సుల్తాన్ వివిధ గ్రామ పంచాయతీల సర్పంచులు పాల్గొన్నారు.

రైతులు సంఘటిత మవ్వాలి

ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి రామకృష్ణ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్



రాజకీయాలతో సంబంధం లేకుండా రైతులు తమ సమస్య పరిష్కారం కోసం సంఘటితమై సంఘాన్ని ఏర్పాటు చేసుకొని రైతు సంఘంలో సభ్యులుగా చేరాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ పిలుపునిచ్చారు. శనివారం రైతు సంఘం సభ్యత్వాన్ని ఓర్వకల్లు మండలం నన్నూరు గ్రామంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని రామకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తీవ్రమైన సంక్షోభంలో ఉన్నారని అన్నారు. పంటలు లేక పండిన పంటకు గిట్టుబాటు ధర లేక పెట్టుబడి ఖర్చులు పెరిగిపోయి రైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ప్రభుత్వాలు ఇస్తున్న మాటలు నీటి మూటలుగా ఉన్నాయి తప్ప రైతులకు అనుకూలమైన విధానాలు లేవని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన బడ్జెట్లో రైతులకు వ్యతిరేకంగా ఉన్నాయి తప్ప పరిష్కరించే విధంగా లేవని అన్నారు. ఎరువులు పురుగుల మందులలో సబ్సిడీ కోత విధించారని, మద్దతు ధర చట్టం పైన ఊసే లేదని అన్నారు. ప్రాజెక్టులకు నిధులు నామమాత్రపు కేటాయింపులున్నాయన్నారు కేవలం కార్పొరేట్లకు అనుకూలంగా మాత్రమే బడ్జెట్ రూపొందించారన్నారు. ఈ ప్రాంతంలో పండిన పంటలు ఉల్లి టమేటా పత్తి వేరుశనగ మిరప మొక్కజొన్న పంటలకు ధరలు లేక రైతులు మనోవేదనకు గురవుతున్నారన్నారు. పైపెచ్చు రైతుల అజ్ఞానాన్ని ఆసరా చేసుకుని విత్తన కంపెనీలు నకిలీ విత్తనాలమ్మి రైతులను మోసం చేస్తున్నారని వీటిని అరికట్టేందుకు రైతులు సిద్ధపడాలని కోరారు. అందుకోసం బలమైన సంఘ నిర్మాణం అవసరమని రాజకీయాలతో నిమిత్తం లేకుండా అఖిల భారత రైతు సంఘం పిలుపులో భాగంగా ప్రతి రైతు, రైతు సంఘంలో చేరాలని కోరారు. ప్రతి గ్రామంలో రైతు సంఘాన్ని నిర్మించాలి అనే నినాదాన్ని ముందుకు తీసుకుపోవాలన్నారు. సభ్యత్వం చేర్పించే కార్యక్రమంలో రైతు సంఘం మండల సహాయ కార్యదర్శి మధుసూదన్, నాయకులు వెంకటేశ్వర్లు, పెద్ద వెంకటస్వామి, దస్తగిరి పాల్గొన్నారు.

మొక్కుబడిగా స్థాయి సంఘాల సమావేశం

కోరం లేకుండానే సమావేశాల నిర్వహణ

యుద్ధ ప్రాతిపదికన తాగునీటి పనులు చేయాలి

జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

ఉల్లి రైతుల బాధలు పట్టడం లేదుప్యాపిలి జెడ్పిటిసి

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్



మాట్లాడుతున్న జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

జిల్లాలో ప్రతి 60 రోజులకు ఒకసారి జిల్లా సమగ్రాభివద్ధిపై జెడ్పిటిసి సభ్యులు, జిల్లా స్థాయి అధికారులతో జిల్లా పరిషత్ చైర్మన్ ఆధ్వర్యంలో స్థాయి సంఘాల సమావేశాలను నిర్వహించి జిల్లాలోని సమస్యలు వాటి పరిష్కారాలు అభివద్ధి పై చర్చిస్తారు. అలాంటి ముఖ్యమైన స్థాయి సంఘాలు మొక్కుబడిగా మారిపోతున్నాయి. శనివారం జిల్లా పరిషత్ చైర్మన్ అధ్యక్షతన సిఇఒ సమక్షంలో స్థాయి సంఘాల సమావేశం జిల్లా పరిషత్ మినీహాలులో నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాకు సంబందిన అభివృద్ధి, వలసలు, తాగు నీరు, రోడ్లు, తదితర అంశాలపై చర్చించాల్సిన జడ్‌పిటిలు నామమాత్రమే హాజరయ్యారు. జిల్లా స్థాయి అధికారులు సైతం ఏదో ఒక నెపంతో కింది స్థాయి ఉద్యోగులను స్థాయి సంఘాల సమావేశాలకు పంపుతున్నారు. శనివారం నిర్వహించిన సమావేశంలో గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, సాంఘీక సంక్షేమం, విద్య ,వైద్యం,మహిళ అభివద్ధి, శిశు సంక్షేమం, ఆర్థిక ప్రణాళిక, పనులు అంశాలపై చర్చించారు. ఇందులో ఏడు కమిటిలుగా విభజించారు. అందులో 4,6, స్థాయి సంఘాల సమావేశం కలిపి నిర్వహించారు. సాంఘిక సంక్షేమం, విద్య వైద్యం చర్చించాలి. ఇందులో సభ్యులు మూడవ వంతు ఉండాలి.4వ సమావేశానికి 10 మంది సభ్యులు, 6వ సమావేశానికి 11 మంది సభ్యులు హాజరు అవ్వాలి. కానీ ఇందుకు విరుద్ధంగా రెండు స్థాయి సంఘాల కలిపి నలుగురు మాత్రమే హాజరయ్యారు. కోరం కూడా లేకుండా సమావేశాలు నిర్వహించడం, కోరంలో లేని సభ్యులు సమావేశాల్లో కూర్చోవడంపై స్థాయి సంఘాల స్థాయి లేని సంఘాల అనే అనుమానం వ్యక్తం అవుతుంది. – జిల్లా పరిషత్ చైర్మన్ మాట్లాడుతూ ఒక్కో జెడ్పిటిసి సభ్యునికి రూ.5 లక్షల చొప్పున నిధులు మంజూరు చేశారు. ఈ నిధులను తాగు నీటి పనులకు అర్డబ్ల్యూఎస్ పనులు త్వరగా యుద్ధప్రాతిపదికన నిర్వహించి తాగునీటి సమస్యలు లేకుండా చూడాలన్నారు. అకాల వర్షం వల్ల మిర్చి రైతులు నష్టపోయారని రైతుల నుండి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా తగిన నష్టాన్ని అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అదోనికి తిరుగుతున్న ఆర్‌టిసి బస్సులు సింగిల్ స్టాప్ కాకుండా ప్రయాణికులకు అనుగుణంగా నడపాలని కోరారు. పాఠశాలల పరిధిలోనే ఉపాధ్యాయులు నివాసం ఉండేలా డిఇఒ చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు సమయపాలన పాటించడంలో లోపం లేకుండా చూడాలని తెలిపారు. ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొచ్చేలా ప్రతి కొక్కరు కషి చేయాలన్నారు. కొత్తపల్లి, కష్ణగిరి, ప్యాపిలి, తుగ్గలి, కౌతలం జడ్‌పిటిసిలు వారి మండలంలోని సమస్యలపై ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ దిల్షాద్ ముజాఫర్ నాయక్, డిప్యూటీ సిఇఒ వెంకట సుబ్బారెడ్డి, చైర్మన్ సిసి అశ్విని కుమార్, పరిపాలన అధికారులు జితేంద్ర, జిల్లా అధికారులు జడ్‌పిటిసి సభ్యులు పవిత్ర పాటిల్ ,మౌలాలి, సులేమాన్, ప్రసన్న కుమార్ పాల్గొన్నారు.




సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో కోడుమూరులో ప్రచార భేరి కార్యక్రమం

బిజెపికి హటావో- దేశ్ కి బచావో

ప్రజాశక్తి-కోడుమూరు

బిజెపికి హటావో దేశ్‌కి బచావో నినాదంలో కోడుమూరు పట్టణంలో శనివారం ప్రచారభేరి కార్యక్రమం నిర్వహించారు. కోడుమూరు పట్టణం కొండపేట కాలినిలో 1వరోజు 16,17,18 వ వార్డులలో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో "ప్రచార బేరి" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి రాజు, సిపిఎం మండల కార్యదర్శి గఫూర్ మియా సిఐటియు నాయకులు వీరన్న రైతు సంఘం నాయకులు నాగరాజు,రాముడు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, మేయర్ రామయ్య

జగనన్న మా భవిష్యత్తు విజయవంతం : వైసిపి

ప్రజాశక్తి కర్నూలు క్రైమ్

జగనన్నే మా భవిష్యత్తు కార్య క్రమాన్ని ప్రజలు విజయ వంతం చేశారని ఎమ్మెల్యేలు ఎంఎ ఆఫీస్ ఖాన్, డాక్టర్ జె. సుధాకర్, ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ పాపిరెడ్డి, మేయర్ బివై రామయ్య అన్నారు. శనివారం వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మంత్రులు, ఎమ్మెల్యే, ఎంపీ ప్రతి ఇంటికి వెళ్ళి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మేలును గర్వంగా చెప్పుకున్నామన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేసిన మేలు గురించి వివరించామని, రాష్ట్రంలో 60 లక్షల ఇళ్ళలను వైసిపి ప్రభుత్వం పలకరించిందన్నారు. గత ప్రభుత్వం కంటే చేసిన మేలు గురించి ప్రజల నుండి పీపుల్స్ సర్వే చేశామన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేసిందన్నారు. అవినీతి రహిత పాలనను రాష్ట్ర ప్రభుత్వం అందించిందన్నారు. సమాజం అభివృద్ధికి పాటుపడిన వ్యక్తి సిఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అన్నారు. చంద్రబాబు నాయుడు రూ. 50 వేల కోట్లను ప్రజలకు అందిస్తే, వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రూ.2 లక్షల కోట్లను సంక్షేమ రూపంలో అందించారన్నారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని సిఎంను చేసేందుకు తాము అందరం కష్టపడుతామన్నారు. ఈ సమావేశంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ మద్దయ్య, వైసిపి కార్పొరేటర్ శ్వేత రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఒకేషనల్ కోర్సులతో ఉపాధి అవకాశాలు

- ఆదోని ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ లింగన్న

ప్రజాశక్తి - ఆదోని



అప్రెంటిస్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులతో వైద్యులు

ఒకేషనల్ కోర్సులు చేసిన వారికి ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయని ఏరియా ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లింగన్న, డాక్టర్ పద్మ కుమార్ తెలిపారు. శనివారం పట్టణంలోని నోబుల్ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు హెడ్ సిస్టర్లు స్వర్ణలత, ఇందిరాల ఆధ్వర్యంలో డ్యూటీలు అలాట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 42 మంది నర్సింగ్, 37 మంది మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్లు, 2 ఫిజియోథెరపీ అడ్మిషన్లు పొందిన విద్యార్థులు శ్రద్ధగా శిక్షణ పొందితే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. కళాశాల కరస్పాండెంట్ సంగటి దేవదానం మాట్లాడుతూ... ఆస్పత్రుల్లో శిక్షణ పొందేందుకు అవకాశం కల్పించిన ప్రభుత్వానికి, ఇందుకు తోడ్పాటునందిస్తున్న అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. విజయ కుమారి, మోనా, దినకర్, వీరేష్, రాజా రంగా పాల్గొన్నారు.

దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు

- వైసిపి సీనియర్ నాయకులు జగన్మోహన్ రెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న జగన్మోహన్ రెడ్డి

వేసవి కాలంలో ప్రజల దాహార్తి తీర్చడానికి చలివేంద్రాలు ఎంతోగానో ఉపయోగ పడతాయని వైసిపి నియోజకవర్గ సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలోని సోమప్ప సర్కిల్ సమీపంలో హౌసింగ్ కార్యాలయం పక్కన ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఎంపిపి కేశన్న, పట్టణ ప్రధాన కార్యదర్శి బసరకోడు వీరేంద్ర, కౌన్సిలర్లు వెంకటాపురం బజారి, శివ ప్రసాద్, మన్సూర్ బాషా, గట్టు ఖాజా, వడ్డె రంగన్న, దారాల శ్రీను, కోటెకల్ లక్ష్మన్న పాల్గొన్నారు.

విద్యతోనే బంగారు భవిషత్తు

- సర్పంచి మోహన్‌రాజ్

ప్రజాశక్తి-ఆలూరు



బహుమతులు అందజేస్తున్న సర్పంచి మోహన్ రాజ్

విద్యతోనే విద్యార్థులకు బంగారు భవిషత్తు ఉంటుందని మొలగవల్లి సర్పంచి మోహన్ రాజ్, విఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు వాల్మీకి రామాంజినేయులు తెలిపారు. శనివారం మొలగవల్లి శ్రీకృష్ణదేవరాయ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో కరస్పాండెంట్ సి.ప్రగతి ఆధ్వర్యంలో విద్యార్థులు విజ్ఞాన ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు కష్ట పడి కాకుండా ఇష్టపడి చదవాలన్నారు. విజ్ఞాన ప్రదర్శన వల్ల విద్యార్థులు తమ నైపుణ్యాన్ని పెంపొందించేందుకు దోహద పడుతుందని చెప్పారు. విద్యార్థుల చదువుపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అనంతరం విజ్ఞాన ప్రదర్శనలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. టిడిపి జిల్లా మాజీ కార్యదర్శి మోక మల్లయ్య, సొసైటీ మాజీ డైరెక్టర్ కటారుకొండ ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ 'జగనన్నకు జై' అంటున్నారు

- సర్పంచి తెల్లబండ్ల భీమయ్య

ప్రజాశక్తి - మంత్రాలయం



ప్రజలతో మాట్లాడుతున్న నాయకులు

ప్రతి గడపలో ఉన్న ప్రతి ఒక్కరూ జగనన్నకు జై అంటున్నారని సర్పంచి తెల్లబండ్ల భీమయ్య తెలిపారు. శనివారం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు స్థానిక రామచంద్ర నగర్, రాఘవేంద్ర నగర్ కాలనీలోని ప్రతి ఇంటికీ తిరిగి సంక్షేమ పథకాల అమలు తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ పాలనపై సంతృప్తికరంగా ఉన్నారని చెప్పారు. జగనన్న స్టిక్కర్లు అతికించి 8296082960 నెంబర్‌కు మిస్డ్ కాల్ ఇప్పించారు. వైస్ ఎంపిపి పులికుక్క రాఘవేంద్ర, ఎంపిటిసి జి.వెంకటేష్, నాయకులు జనార్ధన్ రెడ్డి, శివకుమార్, మల్లికార్జున పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో బిజెపిని ఓడించాలి

- సిపిఎం, సిపిఐ నాయకులు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ప్రజా వ్యతిరేక నిరంకుశ మతోన్మాద బిజెపిని వచ్చే ఎన్నికల్లో ఓడించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.వెంకటేశులు, మండల కార్యదర్శి కె.లింగన్న, సిపిఐ మండల కార్యదర్శి బసాపురం గోపాల్ కోరారు. శనివారం సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో మండలంలోని బసాపురం, చిన్నహరివాణం, చిన్నగోనెహాల్, హానవాళ్లు, మదిరె గ్రామాల్లో ప్రచార భేరి నిర్వహించారు. సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు నరసప్ప అధ్యక్షత వహించారు. సిపిఎం మండల కమిటీ సభ్యులు తిక్కప్ప, చిన్న తిక్కన్న, నరసప్ప, గోవిందు, రామప్ప, ఉలిగేష, సిపిఐ నాయకులు రామలింగ, రంజిత్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు.

నందవరం : వచ్చే ఎన్నికల్లో మోడీని ఇంటికి సాగనంపేందుకు ప్రజలందరూ ఏకం కావాలని వామపక్ష నాయకులు కోరారు. మండలంలోని నాగలదిన్నె గ్రామంలో 'మోడీని గద్దె దింపుదాం.. దేశాన్ని కాపాడుకుందాం' ప్రచార భేరి నిర్వహించారు. సిపిఎం మండలం నాయకులు ఎల్లేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు సి.గురుశేఖర్ మాట్లాడారు. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రధానమంత్రి అయిన తర్వాత కార్మికులు, కర్షకులు, ప్రజల నెత్తిన భారాన్ని మోపుతున్నారని విమర్శించారు. ధరలు పెరగడంతో సామాన్యులు బతికే పరిస్థితి లేదని తెలిపారు. సిపిఐ జిల్లా నాయకులు పంపన్న గౌడ్, సిపిఎం మండల కమిటీ సభ్యులు రవి, నాగేష్, కొండయ్య, సంతోష్ పాల్గొన్నారు.

ఆదోని : ప్రజా వ్యతిరేక నిరంకుశ మతోన్మాద బిజెపి ప్రభుత్వాన్ని సాగనంపుదాం, దేశాన్ని కాపాడుకుందామని సిపిఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య కోరారు. రెండోరోజు హవన్నపేట, మరాఠి గేరి కాలనీల్లో సిపిఐ, సిపిఎం పట్టణ కార్యదర్శులు సుదర్శన్, లక్ష్మణ్ ఆధ్వర్యంలో ప్రచార భేరి నిర్వహించారు. ఈ సందర్భంగా గిడ్డయ్య, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.అజయ్ బాబు, సిపిఎం నాయకులు పిఎస్.గోపాల్, లక్ష్మన్న మాట్లాడారు. రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ నియంతృత్వ పోకడలతో పాలన సాగిస్తున్న మోడీతో దేశానికి ప్రమాదం పొంచి ఉందని తెలిపారు. దీనిపై ప్రజలను చైతన్య పరచడమే లక్ష్యమన్నారు. 2024 ఎన్నికల్లో మోడీకి చరమ గీతం పాడేందుకు ప్రజలందరూ సంసిద్ధం కావాలని కోరారు. నాయకులు లక్ష్మీనారాయణ, వెంకన్న, హుస్సేని, కల్లుబావి రాజు, షేక్షావలీ, షాబీర్ బాష, తిప్పన్న, వీరేష్ పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు : కేంద్రంలోని బిజెపి 2014 ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే రానున్న ఎన్నికల్లో బిజెపి ప్రభుత్వానికి రాజకీయ సమాధి కడతారని సిపిఎం నాయకులు రాముడు, సిపిఐ పట్టణ కార్యదర్శి జి.రంగన్న హెచ్చరించారు. బిజెపి ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ సంస్థల అనుకూల విధానాలను విడనాడాలని హితవు పలికారు. పట్టణంలోని మైనారిటీ కాలనీలో సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో ప్రచార భేరి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కేంద్రంలో బిజెపి గద్దెనెక్కిన నాటి నుంచి ప్రజలపై మోయలేని భారాలు మోపుతోందని విమర్శించారు. గ్యాస్, పెట్రోలు, డీజిలు, విద్యుత్ చార్జీలను పెంచి ప్రజల నడ్డి విరిచిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతూ ప్రజాసంపదను దోచిపెడుతోందని విమర్శించారు. ఆఖరికి వ్యవసాయ రంగాన్ని సైతం కార్పొరేట్ పరం చేయడానికి ప్రయత్నించిందని మండిపడ్డారు. సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి బాలరాజు, సమీవుల్లా, సిపిఐ నాయకులు బజారి, జబ్బార్, దాదావలీ, మల్లికార్జున గౌడ్, ఇస్మాయిల్, ఆంజనేయ, మహబూబ్, కేశవ్, నరసింహులు, సుంకన్న, సిపిఎం నాయకులు అబ్దుల్లా, రాజు, హనుమంతు పాల్గొన్నారు.

పెద్దకడబూరు బస్టాండ్ ఆవరణంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు భాస్కర్ యాదవ్, సిపిఐ మండల కార్యదర్శి వీరేష్, సిపిఎం మండల కార్యదర్శి తిక్కన్న, రైతు సంఘం నాయకులు పరమేష్, అంజినయ్య మాట్లాడారు. మోడీ, అమిత్ షా నాయకత్వంలోని బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ కూటమి ప్రజల మధ్య మత విద్వేషాలను రాజేస్తోందని విమర్శించారు. మరో వైపు అదాని, అంబాని లాంటి అతి సంపన్నులకు దేశ సంపదను దోచిపెడుతోందని తెలిపారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించే ప్రతి ఒక్కరినీ నిరంకుశంగా అణచి వేస్తోందన్నారు. రాష్ట్రానికి రావాల్సిన ప్రత్యేక హోదా, పోలవరం నిధులు, రాజధాని నిర్మాణం, రైల్వే జోన్, రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ వంటి హామీలను నెరవేర్చడంలో బిజెపి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. ఇలాంటి ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపుదామని కోరారు. జాఫర్, పటేల్, తిక్కన్న, గిడ్డయ్య, వీరాంజనేయులు, హయత్, పటేల్, ఉప్పర ఈరన్న, డివైఎఫ్ఐ దేవదాస్, వీరేష్ పాల్గొన్నారు.



ఆదోనిలో ప్రచార భేరి నిర్వహిస్తున్న నాయకులు



నందవరంలో మాట్లాడుతున్న గురు శేఖర్



ఆదోనిలో మాట్లాడుతున్న నాయకులు



ఎమ్మిగనూరులో నిరసన తెలియజేస్తున్న నాయకులు



పెద్దకడబూరు బస్టాండ్ ఆవరణలో ధర్నా చేస్తున్న నాయకులు

మట్కా.. మాయ...

- అత్యాశతో మోసపోతున్న పేదలు
- పట్టణ నడిబొడ్డున, సరిహద్దు గ్రామాల్లో జోరుగా మట్కా
- పోలీసుల నిఘా కరువు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

సరిహద్దు ప్రాంతాలతో పాటు పట్టణాల్లోని మార్కెట్ వీధుల్లో మట్కా ఏజెంట్లు రూ.లక్షల్లో దందా కొనసాగిస్తున్నారు. కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లో మట్కా జోరుగా సాగుతోంది. సరిహద్దులో ఉన్న ప్రాంతాల్లో కొందరు ఏజెంట్లు మట్కాను కొనసాగిస్తున్నారు. ఇదంతా సెల్ ఫోన్లలోనే నడిపిస్తున్నారు. పోలీసులు ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకోవడం లేదు. పేద, మధ్య తరగతి ప్రజలు అత్యాశకు పోయి తీవ్రంగా నష్టపోతున్నారు. కలిసి వస్తే కోటీశ్వరులు కావచ్చని భావించి జేబులు ఖాళీ చేసుకుంటున్నారు. హోటళ్లు, కల్లు దుకాణాల్లో ఎక్కడ చూసినా దీని గురించే చర్చించుకుంటున్నారు.

సరిహద్దు ప్రాంతాల్లోనే ఎక్కువ

హోళగుంద, కౌతాళం, మాధవరం, హాలహర్వి, కోసిగితో పాటు పెద్దహరివాణం, సంతేకుడ్లూరు, జాలమంచి, పెద్దతుంబలం, ఆరేకల్, విరుపాపురం, ఆదోని పట్టణంలో ఆదోని నడిబొడ్డున శ్రీనివాస్ భవన్ సర్కిల్, మున్సిపల్ మైదానం వద్ద మట్కా జోరుగా సాగుతోంది. ఈ సరిహద్దు ప్రాంతాల్లోనే మట్కా ఏజెంట్లు అడ్డాలుగా చేసుకుని దందాను సాగిస్తున్నారు. పేకాటను పోలీసులు నియంత్రిస్తుండడంతో దానికి అలవాటు పడిన వారు మట్కావైపు వెళ్తున్నారు. రూ.10కి రూ.80 చొప్పున వస్తుండడంతో ఎక్కువ సామాన్యులు ఈ మహమ్మారి ఆటకు ఆకర్షితులవుతున్నారు. సరిహద్దు ప్రాంతాల్లోని సామాన్యుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుంటున్నారు. మొదట మట్కా చిట్టీల ద్వారా నెంబర్లు కేటాయించి డబ్బులు వసూలు చేసి ఏజెంట్లు వెళ్లిపోయిన తర్వాత ఎవరికి డబ్బులు వచ్చాయనే విషయాన్ని ఫోన్ ద్వారా సమాచారం ఇస్తుంటారు. మరికొంత మంది ఏజెంట్లు స్థానికంగానే అడ్డాలు ఏర్పాటు చేసుకుని రోజంతా మట్కాను కొనసాగిస్తున్నారు. ఎవరు గెలుచుకున్నారో వారికి డబ్బులు ఇచ్చేస్తూ మిగితావి ఏజెంట్ల దగ్గరే పెట్టుకుంటూ సామాన్యుడి జేబును ఖాళీ చేస్తున్నారు.



అవసరమైతే స్థానికంగానే ఏజెంట్లు అప్పులు ఇచ్చి మరి సామాన్యులతో మట్కా ఆడిస్తూ మోసం చేస్తున్నారంటే ఏజెంట్లు ఏ విధంగా రెచ్చిపోతున్నారో ఇట్టే అర్థమవుతోంది. మట్కా బాధితులు అప్పుల పాలవుతూ రోడ్డున పడుతున్నారు.

పోలీసుల నిఘా కరువు

మట్కాను నియంత్రించడంలో పోలీసులతో పాటు నిఘా వర్గాలు దృష్టి సారించడం లేదు. సరిహద్దు ప్రాంతాలపై సైతం నిఘా పెట్టడం లేదు. సరిహద్దు ప్రాంతాల్లో కొందరు పోలీసు సిబ్బందే మట్కాను ప్రోత్సహిస్తున్నట్లు స్థానికంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పేకాట, మట్కాను నియంత్రించేందుకు పోలీసు స్టేషన్లలో ప్రత్యేక నిఘా టీంను ఏర్పాటు చేసినప్పటికీ ఆ టీంలు ఏం చేస్తున్నాయని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మట్కా అడ్డాలపై దాడులు చేయడం, ఏజెంట్లు ఇచ్చే ముడుపులు తీసుకుంటూ వదిలేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. మట్కాపై పోలీసు శాఖ మరింత కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. మట్కా అడ్డాలపై నిఘా పటిష్టం చేసి సరిహద్దు ప్రాంతాలపై నిఘా పెంచి ఎప్పటికప్పుడు దాడి చేసి సామాన్యులు మట్కా బారిన పడకుండా చూడాలి.



లోకేష్‌తో కలిసి నడుస్తున్న అప్సర్ బాష

లోకేష్ పాదయాత్రలో అప్సర్ బాష

ప్రజాశక్తి-ఆదోని

డోన్ నియోజకవర్గం ప్యాపిలి నుంచి పత్తికొండ నియోజకవర్గం శభాష్‌పురం వరకు లోకేష్‌తో పాదయాత్రలో పాల్గొన్నట్లు పార్లమెంట్ మైనారిటీ సెల్ అధ్యక్షులు అప్సర్ బాష శనివారం తెలిపారు. దాదాపు 20 నిమిషాల పాటు వివిధ అంశాలపై లోకేష్‌తో చర్చించినట్లు తెలిపారు. మైనారిటీల సమస్యలను లోకేష్ దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. లోకేష్ యువగళం పాదయాత్రతో టిడిపిలో నూతన ఉత్తేజం ఏర్పడిందని తెలిపారు. ప్రజల్లో మంచి ఆదరణ లభిస్తోందని, యువగళం పాదయాత్రకు విశేష స్పందన లభిస్తోందని చెప్పారు. రాష్ట్రంలో మైనారిటీల అభివృద్ధి, సంక్షేమం టిడిపితోనే సాధ్యమని తెలిపారు. గత నాలుగేళ్లలో రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని, మైనారిటీలకు సంక్షేమ పథకాలు అందరం లేదని లోకేష్‌కు వివరించినట్లు చెప్పారు. త్వరలో ఆదోనిలో కూడా లోకేష్ పాదయాత్ర కొనసాగుతుందని, ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని కోరారు.

'క్రీడలతో బంగారు భవిష్యత్తు'

ప్రజాశక్తి - ఆదోని

క్రీడల్లో రాణిస్తే బంగారు భవిష్యత్తు ఉంటుందని ఆదోని ఫిలిప్స్ కబడ్డీ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా పట్టణంలోని న్యూగాంధీ నగర్‌లో నిర్వహించిన అండర్-19 కబడ్డీ పోటీల్లో విజేతగా నిలిచిన జట్లకు శనివారం నగదు బహుమతి ప్రదానం చేశారు. పోటీలు సింథెటిక్ మ్యాట్‌పై రాత్రి 11 గంటల వరకు ఫ్లడ్ లైట్స్ మధ్య నిర్వహించారు. ఫైనల్ మ్యాచ్‌లో పెద్దహరివాణం జట్టుపై ఆదోని ఫిలిప్స్ కబడ్డీ జట్టు 5 పాయింట్ల తేడాతో ఘన విజయం సాధించింది. విజేతగా నిలిచిన ఆదోని ఫిలిప్స్ జట్టుకు, ద్వితీయ స్థానంలో నిలిచిన పెద్దహరివాణం జట్టుకు నగదు బహుమతి అందించారు. టోర్నీ మొత్తానికి బెస్ట్ రైడర్‌గా బండారి రాజు ఎన్నికైనట్లు తెలిపారు. అసోసియేషన్ సభ్యులు ఎస్.అమర్ ప్రకాష్, మారి, దుబ్బ, నాగరాజు, పరిష, యల్లప్ప, జయరాం, రవి కుమార్ అభినందించారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని వగరూరు, తిమ్మాపురం గ్రామ సమీపంలో ఉన్న వాగు నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వేణుగోపాల్ రాజు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బోయ పాండుకు చెందిన ట్రాక్టర్ ద్వారా మధ్యాహ్నం 1 గంట సమయంలో ఇసుకను తరలిస్తుండగా దాడులు చేసి పట్టుకున్నామని తెలిపారు. స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.



టిడిపి మండల కన్వీనర్ విజయ్ భాస్కర్ గౌడ్

ప్రజా సమస్యల పరిష్కారంలో వైసిపి విఫలం

- టిడిపి మండల కన్వీనర్ విజయ్ భాస్కర్ గౌడ్

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలో ప్రజా సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమయిందని టిడిపి మండల కన్వీనర్ విజయభాస్కర్ గౌడ్ విమర్శించారు. శనివారం ఆయన మాట్లాడారు. మండలంలోని హంద్రీనీవా సుజల స్రవంతి కాల్వ పనులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. నాలుగేళ్ల వైసిపి పాలనలో నిధులు కేటాయించకపోవడంతో కాలువ నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదన్నారు. హంద్రీనీవా కాలువలకు స్లూయిస్ షట్టర్లు ఏర్పాటు చేయకపోవడంతో నీరు వృథా అవుతోందని తెలిపారు. కప్పట్రాళ్ల, పి.కోటకొండ గ్రామాలకు సాగునీరు అందడం లేదన్నారు. గత టిడిపి ప్రభుత్వంలో పంచాయతీ రాజ్ మంత్రిగా నారా లోకేష్ మంజూరు చేసిన గ్రామీణ రహదారుల నిర్మాణాలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే చందంగా ఉన్నాయని తెలిపారు. గ్రామీణ రహదారుల నిర్మాణాలు జరగకపోవడంతో అభివృద్ధి ఆగిపోయిందన్నారు. రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వడం లేదని, కేవలం పంటల బీమా మాత్రమే చెల్లిస్తున్నారని తెలిపారు. వైసిపి పాలనలో పేద, మధ్యతరగతి ప్రజలపై నిత్యావసర సరుకుల ధరలు, విద్యుత్, బస్సు చార్జీలు పెంచి భారాలు మోపారని మండిపడ్డారు. ప్రజా సమస్యలపై టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు కుమారుడు నారా లోకేష్ యువగళం పేరుతో నిర్వహిస్తున్న పాదయాత్రను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈనెల 17 నుంచి 18 వరకు దేవనకొండ మండలంలో నిర్వహిస్తున్న యువగళం పాదయాత్రలో నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని తెలిపారు.

మట్టి నమూనా సేకరణకు ఏప్రిల్, మే అనువు

- వ్యవసాయ సహాయ సంచాలకులు అరుణకుమారి

ప్రజాశక్తి - పెద్దకడబూరు

మట్టి నమూనాల సేకరణకు ఏప్రిల్, మే నెల అనువైనవని వ్యవసాయ సహాయ సంచాలకులు అరుణకుమారి తెలిపారు. శనివారం మండలంలోని హెచ్.మురవని గ్రామంలో ఎఒ వరప్రసాద్ ఆధ్వర్యంలో నేల ఆరోగ్యం, మట్టి పరీక్షలపై రైతు భరోసా కేంద్ర సిబ్బందికి అవగాహన కల్పించారు. జిల్లా వనరుల కేంద్రంలో సహాయ వ్యవసాయ సంచాలకులుగా పని చేస్తున్న అరుణ కుమారి మాట్లాడారు. మట్టి నమూనాల సేకరణ, నేల ఆరోగ్యం అనే అంశంపై జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో రైతు భరోసా కేంద్ర సిబ్బందికి శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. మట్టి నమూనా సేకరణకు ఏప్రిల్, మే అనువైనవని చెప్పారు. ప్రతి గ్రామ పరిధిలో 50 మట్టి నమూనాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. పంటలు సరిగా పండని నేలలను గుర్తించి వాటిలో మట్టి నమూనా తీస్తే పరిష్కారం సులభమవుతుందని చెప్పారు. అనంతరం ఎఒ వరప్రసాద్ మాట్లాడారు. సిబ్బంది అంతా మట్టి నమూనాల సేకరణ చేపట్టాలని, అలాగే రైతు భరోసా డబ్బులు పడని రైతులను గుర్తించి వారి అర్జీలను తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. **ఆదోని (రూరల్)** మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో మండల స్థాయి భూసార పరీక్ష మట్టి నమూనాలు సేకరించే విధానంపై శిక్షణ నిర్వహించారు. సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.గిరీష్ మాట్లాడారు. వ్యవసాయ సాగులో అధిక దిగుబడులకు సాధించాలంటే భూసార పరీక్షలు తప్పనిసరి అని తెలిపారు. జిల్లా వనరుల కేంద్రం నుంచి వ్యవసాయ అధికారి బి.శశిధర్ రెడ్డి, ఎఒ పాపిరెడ్డి పాల్గొన్నారు. **మంత్రాలయం** మండలంలోని చిలుకలడోన గ్రామ రైతులతో సమావేశం ఏర్పాటు చేసి మట్టి పరీక్షల వల్ల రైతులకు కలిగే లాభాలను వివరించారు. ఈ సందర్భంగా ఎఒ జీరా గణేష్ మాట్లాడారు. భూమిలో గల పోషకాలు, ఆరోగ్యం, నీటి నిల్వ స్థితి వంటి అంశాలు మట్టి పరీక్షల ద్వారా తెలుసుకోవచ్చని సూచించారు. **దేవనకొండ** సిఎల్ఆర్‌సి భవనంలో ఎఒ సురేష్ బాబు ఆధ్వర్యంలో నేల ఆరోగ్యం, మట్టి పరీక్షలపై రైతు భరోసా కేంద్ర సిబ్బందికి మండలస్థాయి శిక్షణ నిర్వహించారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి మాధురి సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. **చిప్పగిరి** వ్యవసాయ కార్యాలయంలో ఆర్‌బికె సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ ఆనంద్ మాట్లాడారు. భూసార పరీక్షలను పూర్తి చేయాలన్నారు. భూసార పరీక్షలు చేయించుకుని, మోతాదులో రసాయనిక ఎరువులు, సూక్ష్మ పోషకాలను వాడితే రైతులకు పెట్టుబడి వ్యయం తగ్గి నాణ్యమైన దిగుబడులు వస్తాయని తెలిపారు. భూమిలో పోషకాలు, చౌడు, ఉప్పు శాతం ఎంత ఉందో తెలిసిపోతుందన్నారు. అనంతరం చిప్పగిరి ఆర్‌బికె పరిధిలో ఉన్న రైతు కొండ గోపాల్ పొలంలో భూసార నమూనాలకు మట్టిని సేకరించారు. ఎఇఒ రమాదేవి, ఆర్‌బికె సిబ్బంది పాల్గొన్నారు. **హాలహర్వి** రైతు భరోసా కేంద్రంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్, మల్టీపర్పస్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్స్‌కు నేల ఆరోగ్యం, మట్టి పరీక్షపై మండల స్థాయి శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ శివశంకర్ మాట్లాడారు. వేసవిలో ప్రతి రైతూ తప్పనిసరిగా భూమిలోని మట్టిని పరీక్ష చేసుకోవాలని సూచించారు.



ఆదోనిలో భూసార పరీక్షకు మట్టి సేకరిస్తున్న అధికారులు



చిప్పగిరిలో



జగనన్న లేఅవుట్లను పరిశీలిస్తున్న అధికారులు

పని చేయని వాలంటీర్లకు మెమోలు

- ఎంపిడిఒ ఆంథోని

ప్రజాశక్తి - హాలహర్వి

పని చేయని వాలంటీర్లకు మెమోలు జారీ చేసి తొలగిస్తామని ఎంపిడిఒ ఆంథోని హెచ్చరించారు. శనివారం మండలంలోని చింతకుంట గ్రామంలో జగనన్న లేఅవుట్లను సందర్శించారు. అంతకముందు వాలంటీర్లకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వాలంటీర్ల పనితీరు తెలుసుకొని, వాలంటీర్లు పనిచేయకపోతే మెమోలు జారీ చేసి తొలగిస్తామని తెలిపారు. వాలంటీర్లు పనితీరు మార్చుకోవాలని సూచించారు. ప్రజా ప్రతినిధులు, సచివాలయ సిబ్బంది చెప్పిన పని చేయట్లేదని, ఇలా చేయకుండా ఉంటే వారిని తొలగిస్తామని చెప్పారు. సచివాలయ సిబ్బంది భాస్కర్, ఇఒఆర్‌డి మల్లికార్జున, చింతకుంట సర్పంచి సుల్తాన్ బాష పాల్గొన్నారు.

'దళిత కాలనీల సమస్యల పట్ల నిర్లక్ష్యం వీడాలి'

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

దళిత కాలనీల సమస్యల పట్ల అధికారులు నిర్లక్ష్యం వీడాలని కెవిపిఎస్ నాయకులు కోరారు. శనివారం మండలంలోని సంతేకుడ్లూరు గ్రామంలో గ్రామసభలో స్థానిక సమస్యలపై కెవిపిఎస్ మండల కార్యదర్శి తిక్కప్ప, గ్రామ అధ్యక్షులు పరమేష్ ఆధ్వర్యంలో ఎంపిపి దానమ్మకు, సర్పంచి ధనలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామాల్లో సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, సమస్యలను పట్టించుకునే నాథుడే లేరని తెలిపారు. దళిత కాలనీలో సిసి రోడ్లు, డ్రెయినేజీ సౌకర్యం, విద్యుత్ తీగలు, తాగునీటి సమస్యలతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి దళిత కాలనీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకపోతే కెవిపిఎస్ ఆధ్వర్యంలో సచివాలయ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కెవిపిఎస్ గ్రామ కమిటీ సభ్యులు మహారాజు, వీరేష్, గాది, సిద్ధప్ప, ఉలిగప్ప, రామప్ప పాల్గొన్నారు.



ఎంపిపి దానమ్మకు వినతి ఇస్తున్న నాయకులు

నేడు ప్రవేశ పరీక్షలు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల 5వ తరగతి ప్రవేశ పరీక్షను ఈనెల 16న నిర్వహిస్తున్నట్లు పరీక్ష సూపరింటెండెంట్ సి.విశ్వనాథ్ రెడ్డి శనివారం తెలిపారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బి గెస్ట్ హౌస్, కెజిఎన్ ఫంక్షన్ హాలు పక్కనున్న ప్రభుత్వ బీసీ కళాశాల వసతి గృహంలో పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు బ్లూ లేదా బ్లాక్ బాల్ పాయింట్ పెన్ను, తప్పనిసరిగా ఎగ్జామ్ ప్యాడ్, హాల్ టికెట్, ఆధార్ కార్డు తీసుకుని పరీక్ష కేంద్రానికి అరగంట ముందుగానే చేరుకోవాలని సూచించారు. పరీక్ష ఉదయం 10 నుంచి 12 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. పరీక్ష కేంద్రంలోకి సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, వాచ్‌లు అనుమతించబోమని చెప్పారు. ఇతర వివరాలకు 9110596480 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

లోకేష్ పాదయాత్రలో మాజీ ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు



లోకేష్‌తో పాటు మాజీ ఎమ్మెల్యే బీవీ

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ నిర్వహిస్తున్న యువగళం పాదయాత్ర జిల్లాలోని పత్తికొండ నియోజకవర్గంలో కొనసాగింది. శనివారం నారా లోకేష్‌తో మాజీ ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. లోకేష్ పాదయాత్రకు పెద్ద ఎత్తున స్పందన వస్తోందని, రాష్ట్రంలో టిడిపి అధికారంలో రావడం ఖాయమని తెలిపారు.

సొసైటీ అభివృద్ధికి కృషి

- చైర్మన్ ఊనేబాద్ మల్లికార్జున

ప్రజాశక్తి - చిప్పగిరి




మల్లికార్జునను సన్మానిస్తున్న దామోదర, ఆంజనేయులు

సొసైటీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని నూతన ఛైర్మన్‌గా ఎంపికైన ఊనేబాద్ మల్లికార్జున తెలిపారు. శనివారం ఆయన చిప్పగిరిలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం సహకారంతో ముందుకెళ్తానని తెలిపారు. రైతులకు అందుబాటులో ఉంటూ సొసైటీలో ఏ సమస్య వచ్చినా వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. నూతన ఛైర్మన్‌గా ఎంపికైన సందర్భంగా మల్లికార్జునను దౌల్తాపురం మేకల దామోదర, ఆంజనేయులు శాలువా, పూలమాలతో సన్మానించారు. అందరి సహకారంతో సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

'తాగునీటి సమస్యను పరిష్కరించండి'

ఆదోనిరూరల్ : మండలంలోని బల్లేకల్ గ్రామంలో వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సమస్యను పరిష్కరించాలని సిఐటియు నాయకులు వీరేష్, నాగార్జున కోరారు. శనివారం సచివాలయం సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామంలో వేసవిని దృష్టిలో ఉంచుకొని తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని కోరారు. గ్రామంలో డ్రెయినేజీ, సిసి రోడ్లు ఏర్పాటు చేసి ప్రజల అవసరాలు తీర్చాలని తెలిపారు. లేకపోతే గ్రామ సచివాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

ప్రజాశక్తి
ఆదివారం 16 ఏప్రిల్ 2023
5
నంద్యాల






దోన్‌లో కరపత్రాలు పంచుతూ ప్రజల్లో చైతన్యం నింపుతున్న సిపిఎం నాయకులు

ఆదాయం ఫుల్.. వసతులు నిల్..

- అవుకు రిజిస్టర్ కార్యాలయంలో కనీస వసతులు కరువు
- శిథిలావస్థలో భవనం - మహిళలకు మరుగుదొడ్లు లేక అవస్థలు
- చెట్ల కింద కూర్చుంటున్న ప్రజలు - పట్టించుకోని ఉన్నతాధికారులు



1905లో నిర్మించిన సబ్ రిజిస్టర్ కార్యాలయ భవనం

ప్రజాశక్తి - అవుకు

అవుకు సబ్ రిజిస్టర్ కార్యాలయానికి ఆదాయం బాగా ఉన్నా ప్రజలకు, మహిళలకు కనీస వసతులు కల్పించడంలో ఉన్నతాధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఈ సబ్ రిజిస్టర్ కార్యాలయానికి అవుకు, కొలిమిగుండ్ల, సంజామల మండలాల ప్రజలు రిజిస్ట్రేషన్ నిమిత్తం ప్రతి రోజూ అధిక సంఖ్యలో వస్తుంటారు. ప్రజలు కూర్చోవడానికి కనీసం కుర్చీలు లేవు. మహిళలు కాలకృత్యాలు తీర్చుకోవడానికి మరుగుదొడ్లు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కార్యాలయం భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది.

ప్రభుత్వానికి ప్రతి ఏటా ఆదాయ మార్గాల్లో అధిక లాభం వచ్చేది ఒకటి రిజిస్ట్రర్ ఆఫీస్‌లు. అవుకు, కొలిమిగుండ్ల, సంజామల మండలాల ప్రజలు ఏదైనా స్థిరాస్థులకు సంబంధించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటే అవుకు మండల కేంద్రంలో ఉన్న సబ్ రిజిస్ట్రర్ కార్యాలయంకు రావాలి. 1905 సంవత్సరంలో అవుకు పట్టణంలో సబ్ రిజిస్ట్రర్ కార్యాలయాన్ని నిర్మించారు. ఈ కార్యాలయం ఆవరణం మొత్తం 74 సెంట్ల విస్తీర్ణంలో ఉంది. కార్యాలయం నిర్మించి ఇప్పటికి 118 ఏళ్లు గడుస్తున్నాయి. అయినప్పటికీ రిజిస్ట్రేషన్లకు వచ్చే మహిళలకు, పురుషులకు, వృద్ధులకు కనీస వసతులు ఏర్పాటు చేయడంలో ఉన్నతాధికారులు దృష్టి సారించడం లేదు. సబ్ రిజిస్టర్ కార్యాలయం నుంచి ప్రభుత్వానికి ఆదాయం వస్తున్నా వసతులను కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. మూడు మండలాలకు చెందిన ప్రజలు నిత్యం అవుకు సబ్ రిజిస్టర్ కార్యాలయానికి వందల మంది వచ్చి వెళుతూ ఉంటారు. ప్రజలు తమ స్థిర చరాస్తులు సంబంధించి రిజిస్ట్రేషన్లు చేయించుకోవడానికి ఉదయం నుండి సాయంత్రం వరకు అక్కడే వేచి ఉంటారు. రిజిస్ట్రేషన్‌కు వచ్చిన వారికి కనీసం కూర్చోవడానికి వసతులు లేక చెట్లకిందే కూర్చోవాల్సిన దుస్థితి ఉంది. మహిళలు, వృద్ధుల ఇబ్బందులు చెప్పనలవి కావు. మహిళలకు మరుగుదొడ్లు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ కార్యాలయానికి జిల్లా, రాష్ట్రస్థాయి అధికారులు వచ్చినప్పుడు ఈ విషయం పలుమార్లు విన్నవించారు. అయితే ఇంతవరకు ఎటువంటి ప్రయోజనం లేదని ఆయా మండలాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్యాలయం ఆవరణలో చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగి వాటి మధ్యలోనే శిథిలమైన మూత్ర విసర్జన గదిలోకి మహిళలు వెళ్లలేక అనేక అవస్థలు పడుతున్నారు. రిజిస్ట్రేషన్ కార్యాలయ భవనం పూర్తిగా శిథిలమైంది. ఏ కొద్దిపాటి వర్షం వచ్చినా సబ్ రిజిస్ట్రర్ కార్యాలయం మొత్తం తడిసి ముద్దయి భవనం లోపలికి నీరు చేరి రిజిస్ట్రార్లు, డాక్యుమెంట్లు, పత్రాలు తడిసిన ఘటనలు కోకొల్లలు. వర్షాల సమయంలో కార్యాలయంలో పనిచేసే సిబ్బంది భవనంపై పట్టాలను కప్పి నీరు భవనంలోకి రాకుండా నానా అవస్థలు పడుతుంటారు. ఇక్కడ పనిచేసే సబ్ రిజిస్ట్రార్లు నూతన భవనాన్ని నిర్మించాలని పలుమార్లు ఉన్నతాధికారులకు నివేదికలు పంపినా ఇంతవరకు ఎటువంటి చలనం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ సబ్ రిజిస్టర్ కార్యాలయంపై శ్రద్ధ చూపి నూతన భవనాలను, ప్రజలకు, మహిళలకు కనీస సౌకర్యాలను ఏర్పాటు చేయాలని మూడు మండలాలకు చెందిన ప్రజలు కోరుతున్నారు.



శిథిలమైన మూత్ర విసర్జన గది

ఎలాంటి వసతులు లేవు



పేరుకే సబ్ రిజిస్ట్రర్ కార్యాలయం. కానీ ఇక్కడ ఎటువంటి వసతులు లవు. ఏ చిన్నపాటి వర్షం వచ్చినా భవనం మొత్తం నీరు కారి డాక్యుమెంట్లు తడిసి పోతుంటాయి. అయినా ప్రభుత్వం నూతన భవనాలను నిర్మించకుండా కాలయాపన చేస్తుంది. రిజిస్ట్రేషన్లకు వచ్చే మహిళలు మరుగుదొడ్లకు వెళ్లాలంటే ఊరి బయటకు పోవాల్సిన దుస్థితి ఉంది. ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా సబ్ రిజిస్ట్రర్ కార్యాలయం రూపురేఖలు మాత్రం మారడం లేదు.

-గొంగటి జగన్మోహన్ రెడ్డి, మెట్టుపల్లి గ్రామం.

భవనం శిథిలమైన మాట వాస్తవమే..



ఈ కార్యాలయం 1905లో నిర్మించినది వాస్తవమే. భవనం పూర్తిగా శిథిలం కావడంతో ఈ సంవత్సరమే కొంతమేర మరమ్మతులు చేసి రంగులు కూడా వేయించాం. ఇక్కడ వసతులు లేవన్న మాట కూడా వాస్తవమే. ఈ విషయాన్ని రాష్ట్రస్థాయి అధికారులకు తెలియజేశాం. కార్యాలయం 74 సెంట్లు విస్తీర్ణంలో ఉంది. వసతులు ఏర్పాటు చేసేందుకు కావాల్సిన స్థలం ఉంది. ఉన్నతాధికారులు ఆదేశిస్తే తప్పకుండా అన్ని వసతులు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

- హాజీ మియా, సబ్ రిజిస్ట్రర్. అవుకు.

మైనింగ్ కళాశాల ఏర్పాటు చేయాలి

- సిపిఎం ఆధ్వర్యంలో రెండో రోజు ప్రచార భేరిలో నాయకులు

ప్రజాశక్తి - డోన్

రాష్ట్ర విభజన సందర్భంగా పార్లమెంట్ సాక్షిగా ప్రధానమంత్రి చెప్పిన విధంగా డోన్‌లో జాతీయ మైనింగ్ కళాశాలను ఏర్పాటు చేయాలని సిపిఎం డోన్ పట్టణ, మండల కార్యదర్శులు నక్కి శ్రీకాంత్, కె.నాగరాజులు డిమాండ్ చేశారు. ప్రచార భేరి పాదయాత్ర రెండో రోజు శనివారం సిపిఎం ఆధ్వర్యంలో శ్రీరామనగర్, 23వ వార్డులో నిర్వహించారు. ఇంటింటికి కరపత్రాలు పంచుతూ కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. డోన్‌లో మైనింగ్ కళాశాలను ఏర్పాటు చేస్తామని ప్రధాని మోడీ ఇచ్చిన హామీ నేటికీ అమలు చేయలేదన్నారు. తక్షణమే జాతీయ మైనింగ్ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ మండల కార్యదర్శి నక్కి హరి, ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు అశోక్, ఐద్వా నాయకు రాలు అమృత, పర్వీన,మాధవి, చరణ్, తదితరులు పాల్గొన్నారు. **బనగానపల్లె :** బిజెపి ప్రజా వ్యతిరేక నిరంకుశ మతోన్మాద పాలనను గద్దె దింపాలని సిపిఐ మండల కార్యదర్శి సుబ్బారెడ్డి, సీనియర్ నాయకులు సంజీవులు అన్నారు. పట్టణంలో రెండవ రోజు ప్రచార భేరి కార్యక్రమం సిపిఐ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో అలుము కుంటున్న చీకట్ల నుండి బయటపడడానికి ప్రజానికమే ఉవ్వెత్తున కదిలి ఉద్యమించాలని పేర్కొన్నారు. మహెూద్యమం నిర్మించడానికి వాపక్ష పార్టీలు ముందుకు వస్తున్నాయని, ప్రజలు తమ వంతు సహకారం అందించాలని కోరారు. పిఎన్ఎం జిల్లా కార్యదర్శి శివయ్య, ఏఐటీయూసీ జిల్లా ఆర్గనైగింగ్ కార్యదర్శి శివ బాలకృష్ణ, గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్షులు కాలంగి రాముడు, సిపిఐ నాయకులు శివనాగయ్య, సుబ్బయ్య, కైప కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.



మహానంది : పరీక్షలు ముగియడంతో ఆనందంగా వెళ్తున్న విద్యార్థులు

ప్రశాంతంగా ముగిసిన పది పరీక్షలు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జిల్లాలో జరుగుతున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు శనివారం ముగిశాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంతంగా ముగిశాయి. చివరి రోజు పరీక్షా కేంద్రాలను డిఇఒ అనురాధ తనిఖీ చేశారు. చివరి రోజు జరిగిన సోషల్ పరీక్షకు 125 పరీక్షా కేంద్రాలలో 22,797 విద్యార్థులకు గాను 22,543 విద్యార్థులు హాజరు కాగా 254 మంది గైర్హాజరైనట్లు ఆమె తెలిపారు. **మహానంది :** మహానంది మండలం గాజులపల్లె గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, క్రీస్తుజ్యోతి పాఠశాలలో శనివారం ఆరవ రోజు సాంఘికశాస్త్రం పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ముగిశాయి. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 166 మంది విద్యార్థులకు గాను 164 మంది హాజరయ్యారని, క్రీస్తుజ్యోతి పాఠశాలలో 154 మందికి గాను 147 మంది హాజరయ్యారని సిట్టింగ్ స్క్వాడ్ కస్టోడియన్ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఆఖరి పరీక్ష కావడంతో దూరప్రాంతాలకు చెందిన విద్యార్థులు ఉదయం 8 గంటలకు కేంద్రాలకు చేరుకున్నారు. పరీక్షలు ప్రారంభమైన నాటి నుండి నేటి వరకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రశాంతంగా ముగిశాయి. పరీక్షలు ముగియగానే విద్యార్థులు ఇళ్లకు హుషారుగా తరలివెళ్లారు. క్రీస్తు జ్యోతి పాఠశాల కరస్పాండెంట్ షిధిన్ శామ్యూల్ మాట్లాడుతూ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ముగిశాయని, మొదటిసారి పాఠశాలకు పదో తరగతి పరీక్షలు రాయడానికి సెంటర్ రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. **రుద్రవరం :** రుద్రవరంలోని జెడ్పీఎస్ ఉన్నత పాఠశాల, మోడల్ పాఠశాలలో జరిగిన పది పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. జడ్పీహెచ్ ఉన్నత పాఠశాలలో 153 మంది విద్యార్థులు, మోడల్ పాఠశాలలో 198 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు.

మంత్రి బుగ్గన పాదయాత్రలో అపశృతి

- నాయకులు, ప్రజలు, విలేకరులపై తేనెటీగల దాడి

ప్రజాశక్తి - బేతంచెర్ల

బేతంచెర్ల మండలం సీతారామాపురం మెట్ట నుండి గ్రామంలోకి రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి శనివారం చేపట్టిన పాదయాత్రలో అపశృతి చోటు చేసుకుంది. మెట్ట దగ్గర పాదయాత్ర ప్రారంభం కాగానే పెద్ద తేనెటీగలు నాయకులు, కార్యకర్తలు, మహిళలు, విలేకరులపై దాడి చేశాయి. వెంటనే వీరిని బేతంచెర్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అంతకుముందు జరిగిన కార్యక్రమంలో సీతారామపురం మెట్ట నుంచి సీతారామపురం గ్రామం వరకు రూ.2.80 కోట్లతో నిర్మించిన తారు రోడ్డును మంత్రి ప్రారంభించారు. అనంతరం మెట్ట నుంచి గ్రామం వరకు 4.5 కిలోమీటర్లు మంత్రిగా పాదయాత్రగా వెళ్లారు. గ్రామంలో ఏర్పాటు చేసిన 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమంలో మంత్రి బుగ్గన పాల్గొని మాట్లాడారు. డోన్‌ను మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. రూ.750 కోట్లతో సోమయాజుల పల్లె నుండి డోన్ వరకు జాతీయ రహదారి పనులను వచ్చే రెండు నెలల్లో ప్రారంభిస్తున్నామని తెలిపారు. యువగళం పాదయాత్రలో నారా లోకేషన్ చేసిన వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించారు. తాము రెండు దఫాలకే గోరుకల్లు రిజర్వాయర్ నుండి రూ.330 కోట్లతో నియోజకవర్గ పరిధిలోని ప్రతి ఇంటికి స్వచ్ఛమైన మంచి నీటిని డిసెంబర్ నాటికి అందించబోతున్నామని చెప్పారు. చంద్రబాబు 8 సార్లు కుప్పంలో ఎమ్మెల్యే, సిఎంగా పని చేసినా ఆ నియోజకవర్గంలో ఇంటింటికి మంచి నీళ్లు ఇవ్వలేదని,ఇక ఇసుక మాఫియా అంటే తమ నియోజకవర్గ పరిధిలో అసలు నదులే లేవని, మైనింగ్ మాఫియాలో 90 శాతం టిడిపి నాయకులే ఉన్నారంటూ ఎద్దేవా చేశారు. ఏదేమైనా డోన్ నియోజకవర్గంలోని బేతంచెర్ల, డోన్, ప్యాపిలి మండలాలలోని ప్రతి గ్రామానికి శుద్ధ జలాన్ని సిఎం అందిస్తారని తెలిపారు. కల్లబొల్లి మాటలతో మీ మధ్యకు వచ్చే నాయకులను నమ్మకుండా అభివృద్ధికి మారుపేరైన వైఎస్సార్ జగన్మోహన్ రెడ్డి పార్టీని ఆదరించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఎంపిటిసి సుబ్బమ్మ, చిట్టే వేణుగోపాల్ రెడ్డి, నాయకులు తిరుమలేష్ రెడ్డి, దామోదర్ రెడ్డి, గోవింద ఆచారి, ఎంపిపి బుగ్గన నాగ భూషణం రెడ్డి, సీనియర్ నాయకులు బాబుల్ రెడ్డి, చంద్ర రెడ్డి, బేతంచెర్ల నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, పిఎలు ప్రతాప్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, తహశీల్దార్ నరేంద్ర నాథ్ రెడ్డి, ఎంపిడిఒ వెంగన్న, నాయకులు దస్తగిరి, పిట్టల జాకీర్, జయ రామిరెడ్డి, రమణా రెడ్డి, అల్తాఫ్, సర్పంచులు కోడె వెంకటేశ్వర్లు, యుగంధర్ రెడ్డి, జయ ప్రకాష్ రెడ్డి, వైస్ రంగ స్వామి, ఎద్దులన్న, భాస్కర్, రామ నాయుడు, తిరుమలేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సీతారామపురం మెట్ట నుంచి గ్రామం వరకు నిర్మించిన తారు రోడ్డును ప్రారంభిస్తున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి



తేనెటీగల దాడిలో గాయపడిన బేతంచెర్ల శేషరెడ్డి



రంజాన్ వేళలు
ఆదివారం
ఇఫ్తార్ : 6 : 38
సోమవారం
సహేరి : 4 : 38

ప్రచార భేరి ప్రారంభం

ప్రజాశక్తి-కర్నూలు ప్రత్యేక ప్రతినిధి

కేంద్రంలోని బిజెపిని సాగనంపి దేశాన్ని కాపాడుకుందామని సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతినాడు చేపట్టిన ప్రచార భేరి కార్యక్రమం కర్నూలు , నంద్యాల జిల్లాల్లో ప్రారంభమైంది. కలెక్టరేట్ల వద్ద నిరసన తెలిపిన అనంతరం ఆయా పార్టీల నాయకులు , కార్యకర్తలతో భారీ ప్రదర్శనలు నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి అక్కడే భైటాయించారు. పాలకుల ప్రజావ్యతిరేక విధానాలకు ఎండగడుతూ ప్లకార్డులు ప్రదర్శించారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక విద్వేషాలను రెచ్చగొట్టి ప్రజల మధ్యన విభేదాలు సృష్టించి పబ్బం గడుపుకునే పరిస్థితి ప్రజలకు వివరించారు. అంతకు ముందు ఉమ్మడి జిల్లాలో వారంరోజులపాటు విస్తృతంగా ప్రచారం చేశారు. ఈనెల 14 నుంచి 31 వరకు ఈ ప్రచార భేరి కార్యక్రమం కొనసాగనుంది. ఈవారంలో కలెక్టర్, జెసి, ఎస్‌పిలు బదిలీ అయ్యారు. నారాలోకేష్ యువగళం పాదయాత్ర ఉమ్మడి జిల్లాలోకి ప్రవేశించింది. వివిధ రకాల అడాడమిక్ పరీక్షలు ముగిశాయి. ప్రవేశ పరీక్షలకు విద్యార్థులు సిద్దమవుతున్నారు. అంబేద్కర్, పూలే, బాబుజగ్జీవన్ రామ్ జయంతులు నిర్వహించారు. ఎండల తీవ్రత పెరిగింది. గుడ్‌ఫ్రైడే ఉపవాస దీక్షలు ముగివాయి. రంజాన్ ఉపవాస దీక్షలు కొనసాగుతున్నాయి.

లోకేష్ యువగళం యాత్ర: టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం డి.రంగాపురంలోకి ప్రవేశించింది. డోన్ నియోజకవర్గం గుండా కర్నూలు జిల్లా పత్తికొండ నియోజకవర్గంలోకి ప్రవేశించింది. ఉమ్మడి జిల్లాలో 14 నియోజకవర్గాలలో సభలు నిర్వహించనున్నారు. వివిధ రంగాల ప్రజలతో విడివిడిగా నారాలోకేష్ చర్చలు జరపాలని నిర్ణయించారు. 35 రోజులు ఈ యాత్ర సాగే అవకాశం ఉంది. టిడిపి కార్యకర్తలు భారీఎత్తున తరలివస్తున్నారు.

కొత్త సారథులొచ్చారు: కర్నూలు జిల్లా కలెక్టర్ పికోటేశ్వర్‌రావు, ఎస్‌పి, సిద్దార్థ్ కౌశల్, జాయింట్ కలెక్టర్ రామసుందర్‌రెడ్డి బదిలీ అయ్యారు. కొత్త కలెక్టర్‌గా డాక్టర్ పి.సృజన, ఎస్‌పిగా జి.కృష్ణకాంత్, జాయింట్ కలెక్టర్ నారపరెడ్డి మౌర్య బాధ్యతలు చేపట్టారు. నంద్యాల జిల్లాలో ఉపాధి సిబ్బందిని అధికారులను బదిలీ చేశారు. కొత్తవారు వచ్చేవరకు కొంత గందరగోళం ఏర్పండి.

పరీక్ష కాలం : ఇంటర్ పరీక్షలు పూర్తవగానే పదోతరగతి పరీక్షలు ఈ వారమంతా జరిగాయి. శనివారం పదోతరగతి ముగిశాయి. వివిధ రకాల పరీక్షలు, ప్రవేశ పరీక్షల తేదీలు రావడంతో ఇంటర్, టెన్త్, వివిధ రకాల పరీక్షలకు విద్యార్థులు సిద్ధమవుతున్నారు.

ముదిరిన ఎండలు: ఎండా కాలం ముదిరింది. మూడు, నాలుగు రోజుల 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు ఉండటంతో ప్రజలు ఉక్కిరికి బిక్కిరి అవుతున్నారు. ఎనిమిదేళ్ల తరువాత ఇవే అధ్యధిక ఉష్ణోగతలని నిపుణులు అంటున్నారు. వేసవిని తట్టుకునేందుకు ఎసిలు, కూలర్లను ప్రజలు వినియోగిస్తున్నారు. శీతల పానియాలకు గిరాకీలు పెరిగాయి. అప్పుడప్పులు విద్యుత్ కోటలుండటంతో ప్రజలు ఉక్కపోతను తట్టుకోలేక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

పండుగలు: గుడ్‌ఫ్రైడేలు, రంజాన్ పండుగలు రావడంతో చర్చిలు, మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దాతలు క్రిష్టియన్లకు , ముస్లింలకు నిత్యావసర కిట్లను అందజేశారు.

మహనీయుల జన్మదినాలు : బాబుజగ్జీవన్‌రామ్, మహాత్మజ్యోతిరావుపూలే, డాక్టర్ బీమ్‌రావు అంబేద్కర్ జయంతి వేడుకలు ఏప్రెల్ మొదటి రెండో వారంలో వచ్చాయి. ప్రభుత్వ.ప్రయివేటు సంస్థలు ఆయా సంఘాలు మహనీయుల జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఏప్రెల్ 14న భారీ ఎత్తున కార్యక్రమాలు నిర్వహించారు.

నిరసనలు: కేంద్ర ప్రభుత్వం సిపిఎం, సిపిఐతో పాటు కాంగ్రెస్ పార్టీ కూడా వివిధ రూపాల్లో కార్యక్రమాలను చేపట్టింది. నిరసనలు, రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించారు. మట్టి మాఫియాపై సిపిఎం, సిపిఐ, వివిధ సంఘాలతో పాటు జర్నలిస్టు సంఘాలు కూడా నిరసన తెలిపాయి. ఉన్నతాధికారులకు వినతిపత్రాలు సమర్పించారు.



దేన్నీ వదలని ఫ్యామిలీ మాఫియా

- యువగళం యాత్రలో నారా లోకేష్ - తుగ్గలి మండలంలో ఘన స్వాగతం



అభివాదం చేస్తున్న నారా లోకేష్



బహిరంగ సభలో మాట్లాడుతున్న నారా లోకేష్

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి/తుగ్గలి

పత్తికొండ ఎమ్మెల్యే ఫ్యామిలీ మాఫియా దేన్నీ వదలడం లేదని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పేర్కొన్నారు. యువగళం యాత్ర శనివారం ప్యాపిలి మండలం పోలిమేర మెట్ట నుంచి ప్రారంభమై తుగ్గలి మండలం రాంపల్లి క్రాస్ వరకు సాగింది. పత్తికొండ టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి కేఈ శ్యాంబాబు, కేఈ ప్రభాకర్, బత్తిన వెంకటరాముడు, మండల కమిటీ అధ్యక్షులు తిరుపాల్ నాయుడులు లోకేష్‌కు స్వాగతం పలికారు. రాంపల్లి క్రాస్ వద్ద బహిరంగ సభలో లోకేష్ మాట్లాడుతూ మద్దికెర రైల్వేస్టేషన్‌లో కప్పం కట్టలేదని రైల్వే కాంట్రాక్టర్‌పై దాడి చేసి వాహనాలు ఎత్తుకెళ్లింది ఫ్యామిలీ మాఫియా సభ్యులని తెలిపారు. బంగారు గనుల యజమానులను బెదిరించి పనులు జరగకుండా ఆపేశారని, టమాటో మార్కెట్‌లో వ్యాపారస్తులను బెదిరించి కమీషన్లు వసూలు చేస్తున్నారని అన్నారు. ఆఖరికి రేషన్ బియ్యాన్ని కూడా అక్రమ రవాణా చేస్తుంది ఈ ఫ్యామిలీ మాఫియా అని విమర్శించారు. పత్తికొండ చెరువుని కూడా కబ్జా చేస్తున్నారన్నారు. టమోటా జ్యూస్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తాం అన్నారని, శ్రీదేవి గారు ఆ హామీ ఏం అయ్యిందని ప్రశ్నించారు.

దళితుల భూమిని ఆక్రమించిన వైసిపి నేతలు
- లోకేష్‌ను కలిసి గోడు వెళ్లబోసుకున్న బాధితులు

మూడున్నర దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న మా భూమిని వైసిపి నేతలు ఆక్రమించి, భూమిలోకి వస్తే చంపేస్తామని బెదిరిస్తున్నారని పత్తికొండ నియోజకవర్గం చెర్లకొత్తూరు గ్రామానికి చెందిన దళితులు యువనేత నారా లోకేష్‌ను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. పెద్దకొండలో బాధిత దళితులు లోకేష్‌ను కలిసి వైసిపి నేతల అరాచకాన్ని వివరించారు. భూమిని కబ్జా చేసి తమను అడ్డుకుంటున్నారని, ఈ విషయమై ఎమ్మార్వో దగ్గర నుంచి కలెక్టర్ వరకు అధికారులందరికీ మొరపెట్టుకున్నా న్యాయం జరగలేదని తెలిపారు. నాలుగేళ్లుగా మమ్మల్ని పొలంలోకి రానీయకపోవడంతో బీడుగా మారిపోయిందని, న్యాయం చేయాలని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి దగ్గరకు వెళితే భూమి మాది కాదని అంటోందన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చాక తమకు న్యాయం చేయలని కోరారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే వైసిపి నేతలు కబ్జా చేసిన భూమిని దళితులకు అప్పగిస్తామని, న్యాయం కోసం పోరాడుతున్న దళితులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేస్తామని లోకేష్ హామీ ఇచ్చారు.

ఆ ఇళ్లకు ప్రభుత్వం బిల్లులు ఇవ్వడం లేదు
- లోకేష్‌ను కలిసిన ఎన్‌టిఆర్ హౌసింగ్ లబ్ధిదారులు

టిడిపి హయాంలో ఎన్‌టిఆర్ హౌసింగ్ పథకం కింద గ్రామంలో నిర్మించుకున్న ఇళ్లకు ప్రస్తుత ప్రభుత్వం బిల్లులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతోందని ఎస్.రంగాపురం ఎన్‌టిఆర్ హౌసింగ్ లబ్ధిదారులు యువనేత లోకేష్‌ను కలిసి విన్నవించారు. సిసి రోడ్లు, మౌలిక సదుపాయాలు కల్పించకుండా వైసిపి ప్రభుత్వం వేధిస్తుందన్నారు. అప్పలు చేసి ఇళ్ల పూర్తి చేసుకున్న తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం కింద లబ్ధిదారులకు పెండింగ్ బిల్లులు అందజేస్తామని, మౌలిక సదుపాయాలు కల్పిస్తామని లోకేష్ హామీ ఇచ్చారు.

లోకేష్ ను కలిసిన కలచట్ల గ్రామస్తులు..

కలచట్ల గ్రామస్తులు యువనేత లోకేష్‌ను కలిసి పలు సమస్యలు విన్నవించారు. గ్రామంలో అంతర్గత రోడ్లను తవ్వేసి వదిలేయడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, వేసవిలో తాగు, సాగు నీటికి ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. గ్రామ చెరువును హంద్రీనీవా జలాలతో నింపాలని కోరారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కలచట్ల చెరువుకు హంద్రీనీవా నీళ్లిస్తామని లోకేష్ హామీ ఇచ్చారు.

శభాష్‌పురం గ్రామస్తులు..

తుగ్గలి మండలం శభాష్‌పురం గ్రామస్తులు లోకేష్‌ను కలిసి సమస్యలను విన్నవించారు. గ్రామంలో సాగు, తాగునీటి సమస్య అధికంగా ఉందని, పొలాల బోర్ల వద్దకు వెళ్లి తాగునీరు తెచ్చుకోవాల్సి వస్తోందని తెలిపారు.

నిరసన... పోలీసుల రంగ ప్రవేశం..

దళితులను కించపరిచే విధంగా మాట్లాడిన లోకేష్ ఎస్సీలకు క్షమాపణ చెప్పాలంటూ నియోజకవర్గంలోని కొంతమంది దళిత సంఘం నాయకులు, దళితులు శభాష్‌పురంలో పాదయాత్ర చేస్తున్న లోకేష్‌కు సమీపంలో నిరసన వ్యక్తం చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు వారిని చెదరగొట్టే ప్రయత్నం చేశారు. లోకేష్ క్షమాపణ చెప్పేంతవరకు నిరసనను విరమించబోమని వారు చెప్పడంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి వారిని చెదరగొట్టారు. లోకేష్ పాదయాత్ర సజావుగా సాగింది.

లోకేష్‌పై ఫేక్ మీడియా విష ప్రచారం

అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా జగన్ ఫేక్ మీడియాను అడ్డంపెట్టుకొని, ఫేక్ ప్రచారాన్నే నమ్ముకుంటున్నాడని టిడిపి ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.ఎస్.రాజు అన్నారు. క్యాంప్ సైట్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళితులతో జరిగిన ముఖాముఖి కార్యక్రమంలో లోకేశ్ మాట్లాడింది చూస్తే, ఆయన దళితజాతి అభ్యున్నతి కోసం ఎంతగా ఆలోచిస్తున్నాడో అర్థమవుతుందన్నారు. అధికార దాహంతో జగన్ అతని ఫేక్ మీడియా చేసే విషప్రచారాన్ని నమ్మవద్దని దళితులకు విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. తప్పుడు ప్రచారం చేయడం జగన్, అతని దిక్కు మాలిన మీడియాకి, అతని చిల్లరకు కక్కుర్తిపడే పేటీఎం బ్యాచ్‌కే చెల్లిందన్నారు.

- టిడిపి ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఎంఎస్.రాజు.

ముందు నుంచి లోకేష్ వెంటే...

ఆయన వికలాంగుడు.. అయినా అనుకుంటే సాధ్యం కానిది ఏది లేదని నిరూపిస్తున్నాడు. అనంతపురం జిల్లా అమడగూరు మండలానికి చెందిన టిఎన్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కే.రామంజులు నాయుడు తన మూడు చక్రాల బండితో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర వెంటే సాగుతున్నాడు. యాత్ర ప్రారంభం నుండి ఇప్పటి వరకు 900 కిలో మీటర్లు ఆయన కూడా తన యాత్ర సాగిస్తున్నాడు. తనతో పాటు శ్రీ సత్యసాయి జిల్లా రైతు సంఘం అధికార ప్రతినిధి కె.రెడ్డెప్ప కూడా ఉన్నారు.


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న నాయకులు

'ఉపాధి' పెండింగ్ బిల్లులు ఇవ్వాలి

ప్రజాశక్తి - కొత్తపల్లి

పెండింగ్లో ఉన్న ఉపాధి కూలీల బిల్లులను వెంటనే చెల్లించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎన్ స్వాములు, మండల సహాయ కార్యదర్శి ఏ ప్రసాద్ డిమాండ్ చేశారు. శనివారం ముసలమడుగు గ్రామంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత సంవత్సరం 2022 ఏప్రిల్, మే నెలలో చేసిన పనులకు నేటికీ చెల్లించలేదు అన్నారు. ఈ ఏడాది మార్చి నుంచి కొంతమందికి రెండు మూడు వారాల బిల్లులు పెండింగ్లో ఉన్నాయన్నారు. పని ప్రదేశాలలో మెడికల్ కిట్లు లేవన్నారు. కేంద్ర ప్రభుత్వం టిసిఎస్ సాఫ్ట్వేర్ నుంచి ఎన్ఐసి సాఫ్ట్వేర్కి ఉపాధి హామీ పథకాన్ని మార్చిన తర్వాత కూలీలకు ఆన్లైన్ మస్టర్ చేయాలంటే సమస్యలు ఏర్పడుతున్నాయని అన్నారు. సమ్మర్ అలవెన్సులు రావడం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు మమత, పుష్పావతి, మద్దిలేటి, నాగలక్ష్మి, శేష గౌడ్, హుస్సేన్ పాల్గొన్నారు.


తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కార్పొరేట్ విద్యాసంస్థల్లో చేర్పించకండి

ప్రజాశక్తి-డోన్

శ్రీ చైతన్య, నారాయణ వంటి కార్పొరేట్ విద్యాసంస్థల్లో తమ పిల్లల్ని చేర్పించి చంపుకోకండని అని ఎస్ఎఫ్ఐ డోన్ మండల కార్యదర్శి తెలుగు విజయ్ కుమార్, అధ్యక్షులు అశోక్, కోశాధికారి ఇఫ్ఫనాలు పేర్కొన్నారు. శనివారం స్థానిక డోన్ పట్టణంలోని పదవ తరగతి పబ్లిక్ ఎగ్జామ్ జరుగుతున్న గర్ల్స్ హైస్కూల్ దగ్గర కార్పొరేట్ విద్యాసంస్థల్లో మీ పిల్లలను చేర్పించకండని అని కరపత్రాలను వారు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలు ముగిశాయని ఇక ఇంటర్మీడియట్లో ఏ కళాశాలలో చేరాలని ఆలోచిస్తుంటారని, కార్పొరేట్ కాలేజీలో ఏ అద్భుతాలు లేవు అని అన్నారు. టీవీలు, పత్రికల్లో ప్రచారాలు తప్ప ఏమి లేదన్నారు. ఆలోచించి నిజాలు ఏంటో తెలుసుకొని కళాశాల్లో చేరాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కమిటీ సభ్యులు శ్రీనివాస్, లవ కుమార్, శివ, వేణుమాధవ్,సునీల్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సెలవుల్లో ఐసిడిఎస్ పిడి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

స్త్రీ, శిశుసంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ లీలావతి సెలవుల్లో వెళ్లారు. ఈనెల 13 నుండి 30వ తేదీ వరకు ఆమె సెలవుల్లో వెళ్లినట్లు సమాచారం. ఆరోగ్య కారణాలు, వ్యక్తగత కారణాలతో సెలవు పెట్టినట్లు ఆఫీస్ వర్గాలు వెల్లడించాయి. లీలావతి ఆత్మకూరు సీడీపీఓగా ఉంటూ నంద్యాల జిల్లా ఇంచార్జి ప్రాజెక్ట్ డైరెక్టర్గా ఆమె విధులు నిర్వహిస్తున్నారు. రెండు బాధ్యతలు ఉండటం, పని ఒత్తిడి పెరగడం వలన కూడా ఆమె తరచుగా సెలవులు తీసుకుంటున్నట్లు విశ్వసనీయ సమాచారం. అదే బాటలో సూపరింటెండెంట్ శమంతక మణి కూడా సోమవారం నుండి 20 రోజులు సెలవుల్లో వెళుతున్నట్లు సమాచారం.


నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే గంగుల

పలువురు మృతికి ఎమ్మెల్యే సంతాపం

ప్రజాశక్తి - చాగలమర్రి

మండలంలోని గొట్లూరు గ్రామానికి చెంది మాజీ విఆర్ఓ రామకోటిరెడ్డి (75), చాగలమర్రి పట్టణానికి చెందిన వైసిపి నాయకుడు రామ తులసీశ్వర రెడ్డి (55), హమాలీ ఉప్పు షరీఫ్(41), సయ్యద్ అహమ్మద్ (70)లు శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి ఆయా గ్రామాలకు చేరుకొని వారి మృతదేహాలపై పూలమాలలు వేసి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. సంతాపం తెలిపిన వారిలో వైసీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి బాబులాల్, మండల కన్వీనర్ కుమార్ రెడ్డి, వైసిపి నాయకులు జగదీశ్వర్ రెడ్డి, గణేష్ రెడ్డి, వెంకటరమణ, శ్రీనివాసులు,మనోహర్ రెడ్డి,మండల కోఆప్షన్ సభ్యుడు జిగ్గి గారి ఇబ్రహీం, అబ్దుల్లా,ఖాధర్ బాష,రాముడు, తదితరులు ఉన్నారు.

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

మండలంలోని గాలి చెన్నయ్యపాలెం గ్రామంలో ఆదివారం ఉచిత మెగావైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరుగుతుందని సర్పంచ్ కంచర్ల శోభారాణి, ఉపసర్పంచ్ కంచర్ల చిన్న లింగారెడ్డి శనివారం తెలిపారు. ముఖ్యఅతిథిగా డాక్టర్ జి రవికృష్ణ హాజరవుతారని అన్ని రకాల వ్యాధులకు డాక్టర్లు పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారన్నారు. గుండె, యూరాలజీ, స్త్రీ వ్యాధి నిపుణులు, నరాల వ్యాధులకు సంబంధించిన డాక్టర్లు హాజరవుతారని ప్రజలందరూ వినియోగించుకోవాలని కోరారు.

ప్రయాణికులకు సిమెంటు బెంచీలు ఏర్పాటు

ప్రజాశక్తి-డోన్

ప్రయాణికుల సౌకర్యార్థం కోసం సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేసినట్లు డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. శనివారం డోన్ పట్టణంలోని కొండపేట నందు బేతంచెర్లకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన బస్సు షెల్టర్ నందు మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ ఆధ్వర్యంలో డోన్ పట్టణానికి చెందిన డాక్యుమెంట్ రైటర్ ఎస్.జాకీర్ హుస్సేన్ ఆర్థిక సాహకారంతో సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ మాట్లాడుతూ వేసవికాలంని దృష్టిలో ఉంచుకొని తాత్కాలిక బస్సు సెంటర్ ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అందులో ప్రయాణికులు కూర్చో వడానికి ఇలాంటి సౌకర్యాలు లేవని అడిగిన వెంటనే తన స్నేహితుడు ఇలాంటి మంచి పనికి సహకారం అందించడం అభినందనీయం అన్నారు. సిమెంట్ బెంచీలు ప్రయాణికులకు కూర్చోవడానికి ఎంతో ఉపయోగక రంగా ఉంటుందన్నారు. అలాసాయి, బైసానిరాజు, బచ్చుసురేష్ తదితరులు పాల్గొన్నారు.


నూతన సిమెంట్ బెంచీలతో సప్తశైల రాజేష్ మిత్ర బృందం

బిజెపి నిరంకుశ పాలనపై ప్రచార యాత్ర

ప్రజాశక్తి - ఆత్మకూరు

కేంద్రంలో బిజెపి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వెళ్లేందుకు ఈనెల 18వ తేదీ నుండి ప్రచార భేరిని చేపడుతు న్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి. యేసు రత్నం, సిపిఎం పట్టణ కార్యదర్శి ఎ. రణధీర్ తెలిపారు. శనివారం పట్టణంలోని సుందరయ్య భవన్ నందు ప్రచారయాత్ర పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు మాబాష, ఈఎం. రజాక్, స్వాములు, ఏ. సురేంద్ర, షైక్ ఇస్మాయిల్, సద్దాం హుసేన్, మరెన్న, రామ్ నాయక్, తదితరులు పాల్గొన్నారు. **బేతంచెర్ల:** ప్రచార భేరి పాదయాత్రను జయప్రదం చేయాలని సిపిఎం సీనియర్ నాయకులు వై. ఎల్లయ్య, సిపిఎం పట్టణ కార్యదర్శి వై.బి.వెంకటేశ్వర్లు కోరారు. శనివారం స్థానిక పట్టణంలో లారీ మోటార్ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో సిపిఎం మండల ప్రధాన కార్యదర్శి ఆర్.ఈశ్వరయ్య అధ్యక్షతన సిపిఎం ప్రచార భేరి వాల్ పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం వై.ఎల్లయ్య, వై.బి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బిజెపి నిరంకుశ పాలన నుండి దేశాన్ని కాపాడుకోవాలన్నారు. విభజన హామీల అమలు, తదితర సమస్యలపై చేసే ఈ పాదయాత్రలో మండల ప్రజలందరూ పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎస్. బాలయ్య, రాజబాబు, నరసింహాయుడు,నాగరాజు, వస్సూరు,జూనేపల్లె శ్రీను, అంకాలు,రాజు,రామళ్లకోట బాషకిట్టు,మద్దిలేటి స్వామి, గఫార్, కాంటే చిన్న వెంకటేశ్వర్లు,యువరాజు, తదితరులు పాల్గొన్నారు.


ఆత్మకూరు : పోస్టర్లను విడుదల చేస్తున్న సిపిఎం నాయకులు


బేతంచెర్ల : పోస్టర్లను విడుదల చేస్తున్న సిపిఎం నాయకులు


మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వి వెంకటేశ్వరరావు

13న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - ఆత్మకూర్

మే 13 తేదీన జరగనున్న జాతీయ లోక్ అదాలత్ను జయప్రదం చేయాలని ఆత్మకూరు సీనియర్ సివిల్ జడ్జి వి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం కోర్టు ఆవరణంలో పోలీస్ అధికారులు న్యాయ వాదులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. పెండింగ్లో ఉన్న కేసుల వివరాలను ఆయన సమీక్షించి రాజీ కాదగ్గ కక్షదారులతో ముందుగానే మాట్లాడాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో ఆత్మకూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శేషారెడ్డి, ఏజిపి సుధాకర్ రెడ్డి, ఆత్మకూరు సిఐ సుబ్రహ్మణ్యం, వెలుగోడు, ఆత్మకూరు, కొత్తపల్లి, ఎస్సైలు, న్యాయవాదులు సమావేశంలో పాల్గొన్నారు.

1 నుండి ఆన్లైన్లో దర్శనం టికెట్లు



ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైలం క్షేత్రంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్ల ఆర్జిత సేవలు, స్పర్శ దర్శనం టికెట్లను మే 1వ తేదీ నుండి ఆన్లైన్ బుకింగ్ చేసుకోవాలని దేవస్థానం కార్యనిర్వాహణాధికారి లవన్న సూచించారు. ఈ మేరకు శనివారం భ్రమరాంబ సదన్లో సెక్షన్ అధికారులతో పర్యవేక్షకులు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఇఒ మాట్లాడుతూ ఈనెల 25వ తేదీ నాటికి టికెట్లను దేవస్థానం అధికారిక వెబ్సైట్లో అందుబాటులో ఉంచాలని ఐటీ విభాగాన్ని ఆదేశించారు. భక్తులు ఆన్లైన్ ద్వారా బుకింగ్ చేసుకునేందుకు ప్రచారం చేసి, అవగాహన కల్పించాలని సూచించారు. దేవస్థానం పరిధిలోని ప్రధాన కూడలీల వద్ద బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. సామాన్య భక్తులకు స్పర్శ దర్శనానికి ఇబ్బంది కలగకుండా ఉండే విధంగా అన్ని ఆర్జిత సేవలు విడతల వారీగా నిర్వహించే విషయం భక్తులకు తెలిసేవిధంగా తగు ప్రచారాన్ని నిర్వహించాలన్నారు. ఆన్లైన్ ద్వారా టికెట్ బుక్ చేసుకున్న భక్తులు హార్డ్ కాపీతో పాటు ఆధార్ కార్డును వెంట తీసుకొని వస్తేనే దర్శనానికి అనుమతి ఇవ్వడం జరుగుతుందని సూచించారు. ఈ కార్యక్ర మంలో అసిస్టెంట్ కమిషనర్ హెచ్ జి వెంకటేష్, సహాయ కార్య నిర్వహణ అధికారులు ఫణిదర్, ప్రసాద్, మోహన్, హరిదాసు, శ్రీశైలం ఎడిటర్ డాక్టర్ అనిల్ కుమార్, ప్రజా సంబంధాల అధికారి టి శ్రీనివాస్, పర్యవేక్షకులు మధుసూదన్ రెడ్డి, ఉమేష్, రవికుమార్, ఆలయ వసతి విభాగ ఐటీ అధికారులు పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తనాలు అందుబాటులో ఉంచాలి

ప్రజాశక్తి - ఆత్మకూర్

ఖరీఫ్ సీజన్ కోసం విత్తనాలు ఎరువులను సబ్సిడీ ధరకు ఇచ్చే విధంగా ఆర్బికె కేంద్రాలలో రైతులకు అందుబాటులో ఉంచాలని వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కొండలరావు కోరారు. శనివారం మండల పరిధిలోని కరివేన రైతు భరోసా కేంద్రంలో మండల స్థాయి వ్యవసాయ సలహా కమిటీ సమావేశం కొండలరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అవసరమైన వ్యవసాయ పనిముట్లు రైతు భరోసాకు సంబంధించిన నూతన పాస్ పుస్తకాలను ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ ఏడిఏ ఆంజనేయులు, ఏవో విష్ణువర్ధన్ రెడ్డి, ఎంపీపీ నల్లకాల తిరుపాలమ్మ, రైతు సంఘం నాయకులు మహబూబ్ బాషా, అధికారులు పాల్గొన్నారు. **బండి ఆత్మకూర్ :** మండలంలోని రైతు సోదరులు వ్యవసాయ శాఖ సూచనలను పాటించాలని మండల వ్యవసాయ శాఖ అధికారి స్వాతి తెలిపారు. శనివారం బండి ఆత్మకూరు ఆర్బికే నందు మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కృష్ణమల్లారెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఎస్వీపి ప్రోగ్రాం కింద రైతులకు కావలసిన వరి విత్తనాలు, పచ్చిరొట్ట ఫైర్లు, జీలగలు, పిల్లి పెసర అందించడం జరుగుతుందని ఆమె తెలిపారు. రైతు సలహా మండలి అధ్యక్షుడు కృష్ణమల్లారెడ్డి మాట్లాడుతూ రైతులకు కావల సిన వ్యవసాయ పరికరాలను రైతన్నలకు వ్యక్తిగతంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ పనిముట్లు ఇవ్వాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు, తదితరులు పాల్గొన్నారు.


ఆత్మకూరు : సమావేశంలో మాట్లాడుతున్న కొండలరావు

18 వరకు తెలుగు గంగకు సాగునీరు : ఎస్ఇ

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

మండలంలోని తెలుగు గంగ ఆయకట్టుకు ఈ నెల 18వ తేదీ వరకు సాగు నీరు అందిస్తామని తెలుగు గంగ ఎస్ఇ వెంకట రమణయ్య తెలిపారు. శనివారం నాడు తెలుగు గంగ ఆయకట్టు రైతులు పంటలు ఎండిపోతున్నాయని అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా తెలుగు గంగ ఎస్ఇ వెంకట రమణయ్య, ఇఇ వెంకటేశ్వర్లు, డీఈలు వెంకటేశ్వర్లు, రమేష్ బాబు, జై శివ నాయక్ వరి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఇ వెంకట రమణయ్య మాట్లాడుతూ సాగునీరు విడుదల చేస్తామని రైతులు క్రమశిక్షణతో ఒకరి తరువాత ఒకరు తమ పొలాలకు పెట్టుకోవాలని సూచించారు. పైన ఉన్న రైతులు కాలువలకు అడ్డం వేసి రోజుల తరబడి ఉంటే కింద సాగు చేసిన రైతులు ఇబ్బందులు పడతారని గుర్తుంచుకో వాలని తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు తెలుగంగ వర్క్ ఇన్స్పెక్టర్లను పంపి సాగునీరు సజావుగా ప్రతి రైతు పొలానికి అందేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ లో ప్రస్తుతం 3.5 టీఎంసీల నీరు అందుబాటులో ఉందని నీటిని పొదుపుగా వాడుకోవాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రామాపురం గ్రామానికి చెందిన రైతులు బాల సుంకన్న, మారాజు రాజు, బింగి వెంకటేశ్వర్లు, చిన్నరామయ్య, వాసుదేవ రెడ్డి, సఖిలే కృష్ణారెడ్డి, సంత జూటూరు గ్రామానికి చెందిన నడిపి ఎల్లయ్య, నాగేంద్రారెడ్డి, శ్రీనివాసరెడ్డి, మురళి సర్పంచ్, ఎలగల రామచంద్రుడు, తదితరులు పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న ఎస్ ఈ వెంకట రమణయ్య

సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట : వైసిపి

ప్రజాశక్తి - ఆత్మకూరు

సంక్షేమ పథకాలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని వైసిపి నాయకులు, కౌన్సిలర్లు పేర్కొన్నారు. శనివారం ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో 16వ వార్డు కౌన్సిలర్ కే విజయ్ చౌదరి ఆధ్వర్యంలో మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాలు అమలు తీరును తెలుసుకొని, స్టిక్కర్లను అతికించారు. 23వ వార్డులో కౌన్సిలర్ హరిప్రసాద్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. **కొలిమిగుండ్ల :** మండలంలోని ఉమ్మాయిపల్లెలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం జేసీఎస్ మండలం కన్వీనర్ సచివాలయాల కన్వీనర్ మొలక రాజారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడారు. నాగన్న,సోమయ్య,పెద్ద వెంకటరాముడు శ్రీనివాసులు, కృష్ణయ్య,మనోహర్, గృహ సారథులు, తదితరులు పాల్గొన్నారు.


కొలిమిగుండ్ల లో..

తెలుగు క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - అవుకు

పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో త్రైత సిద్ధాంత తెలుగు యుగాది క్యాలెండర్ను శనివారం అవుకు మండల జడ్పిటిసి చల్లా శ్రీ లక్ష్మీ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక కొలిమి గుండ్ల, అవుకు, కోయిలకుంట్ల, కమిటీల అధ్యక్షులు రామకష్ణ సభ్యులు నాయుడు, నరేంద్ర, జనార్ధన్, సురేష్, జయ నాగేంద్ర, ప్రసాదు, చంద్రమోహన్తదితరులు పాల్గొన్నారు.

50 కుటుంబాలు వైసిపిలో చేరిక

ప్రజాశక్తి- బనగానపల్లె రూరల్

పట్టణంలోని కాజీవాడకు చెందిన గౌండ షేక్షావలి ఆధ్వర్యంలో 50 కుటుంబాలు వైసిపిలో శనివారం రాత్రి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సమక్షంలో చేరాయి. వీరికి ఎమ్మెల్యే వైసిపి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సిఎం జగన్మోహన్ రెడ్డి చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు చూసి ఆకర్షితులై 50 కుటుంబాలు వైసిపిలో చేరినట్లు తెలిపారు. గౌండా షేక్షావలికి మంచి గుర్తింపు ఉందన్నారు. పట్టణంలో సుపరిచితుడని, మేస్త్రీగా పని చేస్తూ సుమారు 100 కుటుంబాలకు జీవనోపాధి కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, నాయకులు డాక్టర్ మహ్మద్ హుస్సేన్, అబ్దుల్ ఫైజ్, సైకిల్ షాప్ మహబూబ్ వలీ, కుమ్మరి సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.


కండువా కప్పి వైసిపి లోని ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

ప్రజా సమస్యలు తెలుసుకునేందుకే యువగళం

ప్రజాశక్తి - ప్యాపిలి

ప్రజా సమస్యలు తెలుసుకునేందుకే టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ యువగళం పేరుతో పాదయాత్ర చేపట్టారని బీసీ సాధికారత చైర్మన్ వై. నాగేశ్వరరావు యాదవ్ అన్నారు. శనివారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు యాదవ్ మాట్లాడుతూ యువగళం పాద యాత్రను విజయవంతం చేసిన నాయకులకు,కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. ప్యాపిలి మండలంలో వైసీపీ మంత్రి చేసిన అరాచకాలను లోకేష్ ప్రజలకి వివరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సుంకయ్య, నంద్యాల బీసీ సెల్ అధికార ప్రతినిధి రామ్మోహన్ యాదవ్, వెంకటేశ్వర్ రెడ్డి, మల్లికార్జున, అనుదీప్, కాంతరెడ్డి, మధు, నాగేంద్ర ,రామాంజనేయులు,దానం మధు, కొంగనపల్లి మధు, శీను,ఖాజాపిర, బాల రంగన్న,సుధాకరయ్య, రామిరెడ్డీ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నాగేశ్వరరావు యాదవ్

అక్రమ కట్టడాలు ఆపకపోతే ఆందోళన

- సీనియర్ న్యాయవాది తాతిరెడ్డి తులసి రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

రామకృష్ణ విద్యాలయం స్థలాన్ని ఆక్రమించాలని కొంతమంది అధికార పార్టీకి చెందిన నాయకులు ప్రయత్నిస్తున్నారని ప్రముఖ సీనియర్ న్యాయవాది తాతిరెడ్డి తులసి రెడ్డి ఆరోపించారు. శనివారం శ్రీనివాస్ నగర్లోని రామకృష్ణ విద్యాలయం ఖాళీ స్థలంలో నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను శిల్పి సుబ్బారాయుడు, ఎంఆర్పిఎస్ నాయకులు లక్షణ్లతో కలిసి కట్టడాలను నిలిపి వేశారు. అనంతరం తులసి రెడ్డి మాట్లాడుతూ అధికారుల అనుమతులు లేకుండా రామకృష్ణ విద్యాలయం సొసైటీ కి చెందిన ప్లేగ్రౌండ్ నందు అధికార పార్టీకి చెందిన నాయకులు ఈ స్థలాన్ని ఆక్రమించుకునేందుకు అక్రమంగా కాంపౌండ్ వాల్ పేరుతో నిర్మాణాలు చేపడుతున్నారని తెలిపారు. శిల్పి సుబ్బరాయుడు మాట్లాడుతూ రాజకీయ ఒత్తిళ్లతో మున్సిపల్ కమిషనర్ పనిచేస్తున్నాడన్నారు. తాతిరెడ్డి తులసి రెడ్డి, తదితరులు స్థలాన్ని పరిశీలిస్తుండగా ఎమ్మెల్యే అనుచరులు అక్కడికి చేరడంతో విషయం తెలుసుకున్న టూ టౌన్ సిఐ ప్రభాకర్ రెడ్డి పోలీసులతో అక్కడికి చేరుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా అక్కడినుండి ఇరు వర్గాలను పంపించి వేశారు.


కట్టడాలను పరిశీలిస్తున్న తాతిరెడ్డి తులసిరెడ్డి, తదితరులు

అభివృద్ధి చేసినందుకే ఆదరిస్తున్నారు

: ఎమ్మెల్యే గంగుల

ప్రజాశక్తి - చాగలమర్రి

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను ప్రభుత్వం అందజేసిందుకే ప్రజలు ఆదరిస్తున్నారని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని మద్దూరు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను ఎమ్మెల్యే వివరించారు. జలకళ కింద బోర్లు వేయాలని ఎమ్మెల్యేను రైతులు కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రామిశెట్టి వీరభద్రుడు, మండల కన్వీనర్ కుమార్ రెడ్డి, సింగిల్చిండో అధ్యక్షులు దస్తగిరి, సింగిల్ విండో డైరెక్టర్ శ్రీనివాసులు, ఎంపిటిసిలు బేబమ్మ, లక్ష్మిరెడ్డి, నాయకులు జమాల్ వలి, ఓబులేసు, సాల్మాన్, రమణారెడ్డి, బాబు, ఏసు, ఓబు లేసు,ప్రభుకాంత్,అబ్దుల్ కలాం, శ్రీనివా సులు, ఎంపీడీఓ భాగలక్ష్మి పాల్గొన్నారు.


సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే బ్రిజేంద్రారెడ్డి

ముగిసిన పది పరీక్షలు

చాగలమర్రి : మండలంలో పది పరీక్షలు ముగిశాయి. చాగలమర్రి పట్టణంలోని జడ్పీ బాలుర, బాలికల, సెయింట్ ఆన్స్ ఉన్నత పాఠశాలలోని పరీక్ష కేంద్రాలను ఆళ్లగడ్డ డీఎస్పీ సుధాకర్రెడ్డి పరిశీలించారు. పరీక్షా కేంద్రాల వద్ద పరిస్థితిని సమీక్షించారు. విద్యార్థులు చివరి పరీక్ష ముగి యడంతో పరీక్ష రాసి బయటకు వచ్చి కేరింతలేసారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రమణయ్య,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థినికి అస్వస్థత.. కొత్తపల్లి: పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు రాసేందుకు పరీక్షా కేంద్రంలోకి వెళ్లిన విద్యార్థికి స్వల్ప అస్వస్థతకు గురై వైద్య పరీక్షల అనంతరం పరీక్ష రాసిన సంఘటన కొత్తపల్లి మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే శనివారం మండల కేంద్రంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో కస్తూరిబా గాంధీ బాలికల వసతి గృహంలో పదవ తరగతి చదువుతున్న ఉషా కుమారి పరీక్ష రాసేందుకు పరీక్షా కేంద్రంలోకి వెళ్ళింది. అయితే ఉషా కుమారి స్వల్ప అస్వస్థతకు గురైన సంఘటన తెలుసుకున్న వైద్య సిబ్బంది హాస్టల్ ఉపాధ్యాయులతో కలిసి వెంటనే సమీపంలో ఉన్న ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యాధికారి వినోద్ కుమార్ ఆధ్వర్యంలో వైద్యం అందించిన అనంతరం ఉష కుమారిని అంబులెన్స్ లో పరీక్ష కేంద్రంలోకి తీసుకెళ్లి పరీక్ష రాయించడం జరిగింది.


మట్టి నమూనా సేకరిస్తున్న వ్యవసాయ అధికారులు

భూసారం ఆధారంగా సాగు చేసుకోవాలి

ప్రజాశక్తి - పగిడ్యాల

భూసార పరీక్షల ఆధారంగా పంటలు సాగు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి జ్యోతి కుమార్ రైతులకు సూచించారు. శనివారం పగిడ్యాల రైతు భరోసా కేంద్రం-1లో నేల ఆరోగ్యం మట్టి పరీక్షలపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి మాట్లాడారు. ప్రతి సంవత్సరం ఒకే పంట సాగు చేయకుండా మట్టి పరీక్షల ద్వారా తెలుసుకొని సాగు చేయాలన్నారు. మట్టి పరీక్ష చేసు కొని పంటలు సాగు చేయడం వలన దిగుబడి పెరిగి లాభాలు వస్తాయ న్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణ కట్ట నాయి బ్రాహ్మణుడు మృతి

ప్రజాశక్తి - శ్రీశైలం



శ్రీశైలం దేవస్థానంలో కళ్యాణకట్టలో కమిషన్పై పనిచేస్తున్న చెలిమిళ్ళ శ్రీనివాసులు (46) శనివారం గుండెపోటుతో మృతి చెందాడు. శ్రీశైలం దేవస్థానం కళ్యాణ ఘటన గత కొన్ని సంవత్సరాలుగా శ్రీనివాసులు శ్రీశైల దేవస్థానం కళ్యాణకట్టలో పనిచేస్తూ జీవన కొనసాగిస్తు న్నారు. ఇతనికి భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. మృతి చెందిన శ్రీనివాసులకు కళ్యాణకట్ట నాయి బ్రాహ్మణ సంఘం ప్రగాఢ సంతాపాన్ని తెలిపింది. చనిపోయిన శ్రీనివాసులు కుటుంబానికి సంఘం ఎల్లవేళలా అండగా ఉంటుందని సంఘం సభ్యులు తెలిపారు.

చిన్నారులకు వ్యాక్సినేషన్ వేయించాలి

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

చిన్నారులకు వ్యాక్సినేషన్ వేయించాలని శనివారం జిల్లా రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం జిల్లా సమన్వయ అధికారి డాక్టర్ ఎన్. కాంతారావు నాయక్ సూచించారు. శనిఇవారం గోస్పాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కంపెనీ కొట్టాల, జూలేపల్లె గ్రామాలలో ఆరోగ్య సిబ్బంది నిర్వహిస్తున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. డిస్కార్డ్ వాయిల్ పాలసీల గురించి ఆరోగ్య కార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక ప్రాథమిక పాఠశాలను సందర్శించి, మధ్యాహ్న భోజనం ఆహార పదార్థాలను తనిఖీ చేశారు. హెల్త్ ఎడ్యుకేటర్ - వెంకటరమణ, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ - లోకేశ్వరి, ఆరోగ్య కార్యకర్తలు - లక్ష్మి దేవి, రాజేశ్వరి, ఆశా కార్యకర్తలు - రమాదేవి, శంకరమ్మ, సుజాత, అంగన్వాడీ కార్యకర్తలు - విజయలక్ష్మి పాల్గొన్నారు.

మాజీ ఎంపీ పుట్టిన రోజు వేడుకలు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

గ్రేటర్ రాయలసీమ నాయకులు, మాజీ ఎంపీ గంగుల ప్రతాపరెడ్డి పుట్టిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గంగుల ఫణి కృష్ణ రెడ్డి సైన్యం ప్రతాప్ థియేటర్ సమీపంలోని కార్యాలయం వద్ద కేక్ కట్ చేశారు. అనంతరం ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలలో గర్భిణులకు, బాలింతలకు, రోగులకు పాలు బ్రెడ్డు అందజేశారు. అనంతరం స్ఫూర్తి మదర్ హోమ్లో చిన్న పిల్లలతో కేక్ కట్ చేయించి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా రామ్మోహన్, సుధాకర్ తదితరులు మాట్లాడుతూ పెద్దాయన గంగుల మరెన్నో పదవులను అలంకరించాలని ఆకాంక్షించారు.


స్ఫూర్తి మదర్ హోమ్లో కేక్ కట్ చేస్తున్న దృశ్యం